




అమరావతికి రైల్వేలైన్

వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన అమరావతి నూతన రైల్వే లైన్ ప్రాజెక్టు మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక తెరమీదకు వచ్చింది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో భూసేకరణకు నోటిఫికేషన్లను కూడా వెలువరించింది. ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం మీదుగా ఎన్టీఆర్ జిల్లా పరిటాల.. గుంటూరు జిల్లా అమరావతి మీదుగా నంబూరు వరకు నూతన అమరావతి రైల్వే లైన్‌ను నిర్మించనున్నారు. భూ సేకరణ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.



పెరిగిన విమాన సర్వీసులు

విజయవాడ విమానాశ్రయం కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ కళకళలాడుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాధించిన మిలియన్ మార్క్ ప్రయాణికుల రాకపోకలు మళ్లీ ఇప్పుడు సాధ్యమైంది. డిల్లీ, ముంబాయి, బెంగుళూరు, హైదరాబాద్, చెన్నైలకు రద్దైన విమానాలను పునరుద్ధరించటంతో పాటు అదనంగా మరిన్ని విమానాలను నడుపుతున్నారు. ప్రస్తుతం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 52 విమానాల రాకపోకలు సాగుతుండటం విశేషం. విదేశీ విమానాలకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. విమానాశ్రయంలో సాగుతున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులను కూడా వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంది.


జెట్ సిటీ నమూనా

పునర్నిర్మాణం

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న కూటమి పాలనకు నేటితో ఏడాది

- అశోక్ లేల్యాండ్ కంపెనీ ప్రారంభం.. 600 మందికి ఉద్యోగాలు
- అమరావతి రైల్వే లైన్, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు కదలిక
- జక్కంపూడి జెట్ సిటీ పునర్నిర్మాణానికి అడుగులు.. మల్లవల్లికి మహర్దశ
- పుంజుకున్న విమానయానం.. శరవేగంగా నూతన టెర్మినల్ పనులు
- ఓఆర్ఆర్, విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రవాణా సౌలభ్యం
- ఉమ్మడి కృష్ణాజిల్లా అభివృద్ధే లక్ష్యంగా మరిన్ని ప్రణాళికలు



కూటమి ప్రభుత్వం రాగానే ఉమ్మడి కృష్ణాజిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమై.. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టుల పునరుద్ధరణకు నడుం బిగించింది. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది. మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ కంపెనీని పునఃప్రారంభింపజేయడం, తద్వారా 600 మందికి ఉద్యోగాలు కల్పించడంతోనే తొలి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత విజయవాడ మెట్రో ప్రాజెక్టు, అమరావతి నూతన రైల్వే లైన్, జెట్ సిటీ పునరుద్ధరణతో అభివృద్ధి వైపు అడుగులు వేసింది. కేంద్రాన్ని ఒప్పించి జాతీయ రహదారి ప్రాజెక్టుల సాకారం దిశగా కృషి చేసింది. ఎన్‌డీబీ రోడ్ల విస్తరణ, మల్లవల్లి పారిశ్రామిక వాడకు పూర్వ వైభవం వంటి అనేక లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటితో ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ)



పట్టుబట్టి అశోక్ లేల్యాండ్ ప్రారంభం

అధికారంలోకి వస్తే మల్లవల్లిలోని అశోక్ లేల్యాండ్ ప్లాంట్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. అన్నట్టుగానే ఆ హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది.అధికారంలోకి రాగానే అశోక్ లేల్యాండ్ కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి, వారి ఇబ్బందులు ఏమిటో తెలుసుకుంది. ఎలక్ట్రిక్ బస్సులకు గతంలో బాడీ బిల్డింగ్ చేయాలన్న ఒప్పందం నడిచినా.. కరోనా అనంతరం తలెత్తిన ఆర్థిక మాంద్యం తదితర కారణాలతో ఉత్పాదకత తగ్గటం, బాడీ బిల్డింగ్‌కు ఇంత దూరం రావటం వయబిలిటీగా లేదని ఆ సంస్థ భావించింది. దీంతో ఎలక్ట్రికల్ బస్సులతో పాటు సాధారణ డీజిల్ బస్సులకు కూడా ఇక్కడే బస్ బాడీ బిల్డింగ్ చేసుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో అశోక్ లేల్యాండ్ యాజమాన్యం మిగతా 4లో..

పరిశ్రమలకు ఊతం

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమలు ప్రారంభించలేదన్న పేరుతో 376 యూనిట్ల భూ కేటాయింపులను రద్దు చేయటం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి మరో అవకాశాన్ని కల్పిస్తూ భూ కేటాయింపులను పునరుద్ధరించింది. పరిశ్రమలకు ఊతం ఇచ్చింది.

ఓఆర్ఆర్‌పై ఆశలు

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను కేంద్రం చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది. ఓఆర్ఆర్‌ను చేపట్టేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవలే స్వల్పంగా అలైన్‌మెంట్‌లో కేంద్రం ఆదేశాల మేరకు మార్పులు జరిగాయి. రోడ్డు 70 మీటర్లా.. 140 మీటర్లా అన్న దానిపై అధికారిక ఆదేశాలు రాగానే.. శరవేగంగా ఈ రోడ్డు పనులు పూర్తి కానున్నాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ సింహభాగం వెళుతోంది. ఓఆర్ఆర్‌కు భూ సేకరణ అధికారులను కూడా నియమించారు.




ఇదేం పద్ధతి?

'ప్రొటోకాల్' అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై విమర్శలు

- దుర్గమ్మ దర్శనానికి సిఫార్సు లేఖలు.. టికెట్లు తీయవద్దని నోట్‌లు
- ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారని పలువురి ఆగ్రహం

- తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లేవారిలో పలుకుబడి ఉన్నవారు ప్రజాప్రతినిధులు, అధికారుల సిఫార్సు లేఖలు తీసుకునివెళ్తారు. ఆ లేఖలతో సంబంధిత కౌంటర్‌కి వెళ్లి గుర్తింపు కార్డు ఫొటోస్టాట్ కాపీలను అందజేసి దరఖాస్తు పూర్తి చేస్తారు. ఇలా ఒక దరఖాస్తుపై ఆరుగురికి వీఐపీ బ్రేక్ దర్శనాన్ని టీటీడీ ఇస్తుంది. ఈ దర్శనం టికెట్లకు సంబంధించిన మొత్తాన్ని భక్తులు కౌంటర్లలో చెల్లించాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే భక్తుల చేతుల్లోకి టికెట్లు వెళ్తాయి.
- ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు కొంత మంది ప్రజాప్రతినిధులు, అధికారులు సిఫార్సు లేఖలు ఇస్తున్నారు. ఆ లేఖలపై దర్శనానికి వచ్చిన భక్తుల నుంచి ఎలాంటి టికెట్లు కొనుగోలు చేయించవద్దని రాస్తున్నారు. ఆలయ ఆదాయానికి గండి కొడుతున్న ప్రొటోకాల్ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదేం పద్ధతి అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత అంత ప్రాచుర్యం కలిగినది విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం. ఆలయాలు అన్నింటిలోనూ ఒకే విధానం అమలు చేయాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా ఆచరణలో అమలు కావడంలేదు. దుర్గమ్మ ఆలయానికి ఆదాయాన్ని పెంచాలని అధికారులు ఆరాటపడుతుంటే కొంత మంది ప్రొటోకాల్ జాబితాలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం గండికొడుతున్నారు. సిఫార్సు లేఖలు ఇవ్వడంలో తప్పు లేదని, భక్తుల నుంచి టికెట్లు కొనుగోలు చేయించవద్దని రాయడం ఎంతవరకు సబబు అన్న ప్రశ్న దేవస్థానం వర్గాల నుంచి వినిపిస్తోంది. ఈ విధంగా టీటీడీకి ఇచ్చే లేఖలపై రాయగలరా అని మరికొందరు ప్రశ్నిస్తున్నారు.

రోజుకు వెయ్యి మందిపైనే..

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి రోజుకు 1000 మంది భక్తుల వరకు సిఫార్సులతో దర్శనానికి వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి జిల్లా పరిషత్ చైర్మన్లు మొదలు కేంద్ర మంత్రుల వరకు ఈ సిఫార్సు లేఖలు ఇస్తున్నారు. కొంతమంది కార్యాలయానికి ఫోన్ చేసి చెబుతుంటారు. మరికొంతమంది సందేశాలు మిగతా 4లో..

సాగుపై సందిగ్ధం!

ముందుగానే వచ్చిన రుతుపవనాలు

- గుర్రపు డెక్క, తూడుతో నిండిన కాలువలు
- నేటికీ ప్రారంభం కాని తొలగింపు పనులు
- నీటి విడుదలపై రాని స్పష్టత.. అయోమయంలో రైతులు

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం): జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఈ నెల 3వ తేదీన 42వ జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించారు. పంట కాలువలు, డ్రెయినేజీల్లో గుర్రపు డెక్క, నాచు, కిక్కిస, తూడు పేరుకుపోయాయని, ఇప్పటి వరకు పూడికతీత, కాలువల నిర్వహణ (ఓఅండ్‌ఎం) పనులు ప్రారంభించలేదు.. కాలువల గండ్లు పూడ్చలేదు.. ఇటువంటి పరిస్థితుల్లో కృష్ణాడెల్టాకు సాగునీరు విడుదల చేస్తే చివరి ప్రాంతాలకు నీరు చేరదని, కాలువల్లో పనులు చేశాకే సాగునీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యేలు, సాగునీటి సంఘాల అధ్యక్షులు గళమెత్తారు. సాధ్యమైనంత త్వరగా ఓఅండ్‌ఎం పనులు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే కాలువల్లో ఓఅండ్‌ఎం పనులు నేటికీ ప్రారంభించలేదు. రూ.10 లక్షల విలువైన పనులను కాంట్రాక్టర్లతో పనిలేకుండా సాగునీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిన కేటాయించి, ఈ నెల 1వ తేదీన పనులు చేసేందుకు అనుమతులు ఇచ్చారు. అయినా ఇప్పటి వరకు పనులు ప్రారంభంకాలేదు.


బందరు కాలువలో పెరిగిన గుర్రపు డెక్క

అధ్వానంగా పంట కాలువలు

పామర్రు నియోజకవర్గంలో ఐనంపూడి, గేదెలకోడు, బొప్పాయికోడు, భీమనది డ్రెయిన్‌లు ఉన్నాయి. వీటిలో పూర్తిస్థాయిలో గుర్రపు డెక్క, తూడు నాచు పేరుకుపోయాయి. ఈ ఏడాది నిర్వహణ పనులను ఇంతవరకు ప్రారంభించలేదు. ఇదే విషయాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార రాజా ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదని ఆ ప్రాంత రైతులు అంటున్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే చుక్కనీరు మిగతా 4లో..

ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై రైతులు సందిగ్ధం వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే వచ్చిన రుతు పవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో భూములు సాగుకు సిద్ధమయ్యాయి. అయితే పంట కాలువలు అధ్వానంగా ఉండటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు ఇప్పటి వరకు చేపట్టక పోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదల తేదీపై స్పష్టత రాకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఏపీజీఏడీ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా
- నేడు పోరంకిలో జరిగే కార్యక్రమానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

పెనమలూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సాధారణ పాలనాశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా మిగతా 4లో..


అధికారులతో మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

బదిలీల కౌన్సెలింగ్‌కు ఇద్దరు డీఈవోలు | ఆక్వా పరిశ్రమను గాడిలో పెడతాం | మధ్యాహ్న భోజనం, హాస్టళ్లకు నాణ్యమైన బియ్యం 4

జిల్లాలో భారీ వర్షం

- గుడ్లవల్లేరులో అత్యధికంగా 122.4 మిల్లీ మీటర్ల వర్షపాతం
- కృత్తివెన్నులో అత్యల్పంగా 12.2 మిల్లీ మీటర్లు నమోదు

మచిలీపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. గుడ్లవల్లేరులో అత్యధికంగా 122.4 మిల్లీ మీటర్లు, కృత్తివెన్నులో అత్యల్పంగా 12.2 మిల్లీ మీటర్లు నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 54.8 మిల్లీ మీటర్లుగా ఉంది. గుడివాడలో 107.2 మిల్లీమీటర్లు, ఉంగుటూరులో 87.2, నందివాడలో 84.6, ఉయ్యూరులో 74.6, మొవ్వలో 69.4, పెదపారుపూడిలో 61.8, మిగతా 4లో..

అక్టోబరు 15వ తేదీ వరకు ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి

అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఇసుక రేవుల్లో అక్టోబరు 15వతేదీ వరకు ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపు హాలులో బుధవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జేసీ గీతాంజలి శర్మతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నైరుతి రుతుపవనాల కాలంలో నదుల నుంచి ఇసుక తవ్వకాలపై హరిత ట్రిబ్యునల్ నిషేధం విధించిందన్నారు. ఇప్పటి నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు కృష్ణానది లోని ఇసుకరేవుల్లో ఎలాంటి ఇసుక తవ్వకాలు జరగకుండా అధికారులు మిగతా 4లో..



పొట్లూరి రవిని అభినందిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పొట్లూరి ప్రమాణ స్వీకారం

గుడ్లవల్లేరు, 11 (ఆంధ్రజ్యోతి): మంచితనం, ప్రజాసేవపై అంకితభావంతో పనిచేయగల యువ నేత పొట్లూరి రవి అని అందుకే గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అందరి ఆమోదంతో ఎంపిక చేశామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పొట్లూరి రవికుమార్, వైస్ చైర్మన్‌గా కూనపరెడ్డి కల్యాణకృష్ణ, డైరెక్టర్లచే ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పొట్లూరి రవి రైతులతో అనుబంధమున్న నేత, రైతు అవసరాలెరిగిన వ్యక్తిగా వారి సమస్యలను తీర్చి ముందుండి నడిపిస్తాడని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత రవితో ప్రమాణస్వీకారం, తర్వాత వైస్‌చైర్మన్ కూనపరెడ్డి కల్యాణకృష్ణ, డైరెక్టర్లు తూము పద్మజ, తెల్లాకుల నాగలక్ష్మి, గడ్డం బాలాకుమారి, అనగాని లీలా అనిల్ కుమార్, గోపు వెంకటలక్ష్మి, గాజుల నాగపల్లవి, పామిరెడ్డి అచ్యుతాంబ, కంతేటి వెంకట సుబ్బారావు, కొప్పుల దుర్గా వెంకటేశ్వరరావు, జరుపుల్లా ఖాన్ పఠాన్, చందన దేవ వెంకటరాజుచే ఎమ్మెల్యే ప్రమాణం చేయించి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శాయిన పుష్పావతి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ వల్లభనేని బాబూరావు, గుడివాడ అర్బన్‌బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జీ), గుడివాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్ పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారానికి మండలంలోని కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మునిగిన బస్టాండ్

గుడివాడలో భారీ వర్షం

● నీటమునిగిన పల్లపు ప్రాంతాలు



గుడ్‌మెన్‌పేటలో నీట మునిగిన రహదారి

గుడివాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంగళవారం అర్ధరాత్రి మె రుపులు, ఉరుములతో కూడిన కురిసిన భారీ వర్షానికి గుడివాడలోని లోతట్టు, శివారు ప్రాంతాలు జలమయ్యాయి. స్థానిక గుడ్‌మెన్‌పేటలోని రహదారి, 11వ వార్డు మదర్సా వద్ద రహదారులు మునకేశాయి. ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో స్థానిక కోతిబొమ్మ సెంటర్ నుంచి బస్టాండు వరకు ఇరువైపుల రహదారి నీటమునిగింది. పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా బస్టాండ్ చిన్నపాటి చెరువును తలపిస్తోంది. ప్రయాణికులు రహదారిపైకి వచ్చి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

● రూ.6.08 లక్షలు అపరాధ రుసుము విధింపు

పమిడిముక్కల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలపరిధి గ్రామాల్లో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి అనుమతించిన లోడుకు మించి అదనపులోడు వాడుకుంటున్న 188 సర్వీసులను గుర్తించి రూ.6.08 లక్షల అపరాధ రుసుము విధించినట్టు ఏపీసీపీడీసీఎల్ మచిలీపట్నం ఈఈ జీ గోవిందరావు తెలిపారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వాసు ఆధ్వర్యంలో 20 మంది అధికారులు, 50 మంది సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేసి అదనపులోడు వాడుతున్న 188 సర్వీసులను గుర్తించి వారికి రూ.6.08 లక్షలు అపరాధ రుసుము విధించినట్టు తెలిపారు. మీటర్లు లేకుండా నేరుగా కరెంటు వాడుతుంన్నట్టు గమనించామని, విద్యుత్ చౌర్యం నేరమని, అలాంటి వారి గురించి 94408120 91, 9440812363 సెల్ నంబర్లకు తెలియజేయాలన్నారు. మీటర్లకు సీలు లేకుండా ఉండటం, ఉద్దేశపూర్వకంగా సీలు తొలగించుట, గా ట్లు పెట్టుట వంటివి తనిఖీల్లో గమనిస్తే విద్యుత్ చౌర్యంగా భావించి కేసులు పెడతామని హెచ్చరించారు. పామర్రు డీఈఈ కే సుందరరా వు, పమిడిముక్కల ఏఈ బి.శ్రీనివాసరావు, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.



తల్లీ కొడుకుని అరెస్ట్ చేసిన సీఐ చిట్టిబాబు

హత్యకేసులో తల్లీ కొడుకు అరెస్ట్

తోట్లవల్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చాగంటిపాడులో నిమ్మకూరి ఆనందరావు (43)ను దారుణంగా హత్య చేసిన అతడి భార్య సుపాద, కొడుకు వాసంత్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్టు సీఐ వై చిట్టిబాబు తెలిపారు. ఆనందరావు హత్య ఘటనలో నిందితులైన తల్లీ కొడుకుపై 103, రెడ్‌విత్ 3 క్లాజ్ (5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని, గుడివాడ (ఇన్‌చార్జి కోర్టు)కు తరలించగా ఇద్దరికీ జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ తెలిపారు. ఆనందరావు మద్యం సేవించి హింసిస్తున్నాడని సోమవారం రాత్రి భార్య సుపాద, కొడుకు వాసంత్ కలిసి హత్య చేసిన విషయం తెలిసిందే.

మిడ్‌డే మీల్స్, హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నాం: జేసీ



మచిలీపట్నం టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సూపర్ ఫైన్ నాణ్యత గల 9647 సంచులను సరఫరా చేశామని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం నగరంలోని చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు 25 కిలోల సంచుల బియ్యాన్ని స్కూల్ హెచ్‌ఎం జీ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలకు 6,855, సంక్షేమ వసతి గృహాలకు 2,792 సంచుల బియ్యం పంపించామన్నారు. ప్రతి సంచిపైన క్యూ ఆర్ కోడ్‌తో పాటు రైతుపేరు, పీపీసీ కేంద్రం, బియ్యం రకం, రైసుమిల్లు, స్టోరేజ్ గిడ్డంగి, ధ్రువీకరించిన సాంకేతిక వ్యక్తి పేరు, మొదటి ప్యాకింగ్ ఏజెన్సీ వివరాలు ముద్రించి ఉంటాయన్నారు. ఏ మాత్రం అవకతవకలు లేకుండా సక్రమంగా పంపిణీ అయ్యేందుకు పారదర్శకంగా ఏర్పాటు చేశామన్నారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జీ శిరీష, ఎంఈవో గురుప్రసాద్, స్కూల్ హెచ్‌ఎం గురుమూర్తి పాల్గొన్నారు.

బదిలీల కౌన్సెలింగ్‌కు ఇద్దరు డీఈవోలు

● జడ్పీ సమావేశపు హాలు, డీఈవో కార్యాలయం సమావేశపు హాలులో కౌన్సెలింగ్
● 926 మంది ఎస్జీటీలకు బదిలీల కౌన్సెలింగ్ ● మాన్యువల్ కౌన్సెలింగ్‌పై టీచర్ల హర్షం

మచిలీపట్నం టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండో రోజున బుధవారం సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ ఇద్దరు డీఈవోలు నిర్వహించారు. మొదటి రోజున కేవలం 200 మందికే రాత్రి 2 గంటలు పట్టింది. దీంతో ఈ సమస్యను అధిగమించేందుకు కృష్ణాజిల్లా డీఈవో రామారావుతోపాటు ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు కౌన్సెలింగ్ చేపట్టారు. ఈ కౌన్సెలింగ్ ఉమ్మడి కృష్ణాజిల్లాను దృష్టిలో ఉంచుకుని చేపట్టారు. కృష్ణాజిల్లా డీఈవో జీవీజీ రామారావు డీఈవో కార్యాలయం సమావేశపు హాలులో 430 మంది సెకండరీ గ్రేడు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అందులో 136 మంది ఉర్దూ టీచర్లకు, 294 మంది సెకండరీ గ్రేడ్ (తెలుగు) టీచర్లకు కౌన్సెలింగ్ చేపట్టారు. అలాగే జడ్పీ సమావేశపు హాలులో ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ రామారావు కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలను హాలులోకి అనుమతించారు. బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ఎస్జీటీలకు కావల్సిన స్థానాలు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు.





బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కృష్ణా డీఈవో రామారావు, హాజరైన సెకండరీ గ్రేడు టీచర్లు

పారదర్శకంగా కౌన్సెలింగ్

సెకండరీ గ్రేడ్ టీచర్ల మాన్యువల్ కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర పరిశీలకుడు, అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరుగుతున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను ఆయన పర్యవేక్షించారు. కౌన్సెలింగ్‌లో పాయింట్ల విషయంలో ఉపాధ్యాయులు ఎవరైనీ అవకతవకలకు పాల్పడినట్టు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఏసీలు సరిగా పనిచేయడం లేదని కొందరు ఉపాధ్యాయులు అడిషనల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీఈవోలు పీవీజే రామారావు, యూవీ సుబ్బారావుతో పాటు 15 సంఘాల నేతలు పాల్గొన్నారు. కాగా జిల్లా పరిషత్ కార్యాలయం రోడ్డు, ముందర పెద్ద ఎత్తున టీచర్లు వచ్చిన కార్లను చూసి సుబ్బారెడ్డి ఆశ్చర్యపోయారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఆక్వా పరిశ్రమను గాడిలో పెడతాం

● డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

పెనమలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ విధానాలు, ఇటీవల అమెరికా విధించిన పరస్పర సుంకాల కారణంగా సంక్షోభానికి గురైన ఆక్వా పరిశ్రమను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. బుధవారం పెనమలూరు చేపల కుండీల వద్ద ఉన్న ఫిషరీస్ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఏపీ ఆక్వాకల్చర్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణ, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 9న టీడీపీ కూటమి ప్రభుత్వం అమెరికా విధించిన సుంకాలతో సహా ఆక్వా కల్చర్ రంగం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను అధ్యయనం చేయడానికి, పర్యవేక్షించడానికి ఆక్వాకల్చర్ కమిటీని నియమించామన్నారు. ఆక్వా రంగ స్థిరత్వం కోసం స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక వ్యూహాలను చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసిందన్నారు. దీనికోసం 18 కన్సల్టేషన్ సమావేశాలు భౌతికంగా, వర్చువల్ రీతిలో జరిగాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రొయ్యల మేతల ధరలను కిలో రూ.4కు తగ్గించిందన్నారు. రాష్ట్రంలోని మొత్తం 2.07 లక్షల ఆక్వా కల్చర్ చెరువులు, 3800 వ్యాపార యూనిట్ల జియోట్యాగింగ్‌ను మత్స్యశాఖ పూర్తి చేసిందన్నారు. ఏపీఐఐసీ చైర్మన్, ఫిషరీస్ శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, అడిషనల్ కమిషనర్ అంగేలి, ఆక్వా జేడీ లాల్ అహ్మద్ పాల్గొన్నారు.



అక్టోబరు 15వ తేదీ వరకు ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి

(3వ పేజీ తరువాయి)

అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట రేవుల వద్ద గస్తీని పెంచాలన్నారు. ఆర్డీవో, డీఎస్పీ స్థాయి అధికారులు తరచూ ఇసుక రీచ్‌లను తనిఖీ చేయాలని సూచించారు. 3 షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి ఇసుక అక్రమ రవాణా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని శ్రీకాకుళం, నార్త్‌వల్లూరు, రొయ్యూరు, మద్దూరు, చోడవరం, పటమటలంక స్టాక్ యార్డుల్లో 7.50 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇక్కడి నుంచే ఇసుకను ప్రజలు కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఏఎస్పీ సత్యనారాయణ, గనులశాఖ డీడీ శ్రీనివాసకుమార్, భూగర్భ జలశాఖ డీడీ విజయవర్ధన్, నీటిపారుదలశాఖ ఈఈ రవికిరణ్, గనుల శాఖ ఏడీ కొండారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్ పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

(3వ పేజీ తరువాయి)

పెనమలూరులో 61.6, కంకిపాడులో 61.4, పమిడిముక్కలలో 58.2, నాగాయలంకలో 58.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెడనలో 57.7, మచిలీపట్నం సౌత్‌లో 54.2, చల్లపల్లిలో 53.8, బంటుమిల్లిలో 52.6, తోట్లవల్లూరులో 50.4, ఘంటసాలలో 48.6, అవనిగడ్డలో 45.4, మోపిదేవిలో 39.6, కోడూరులో 38.4, పామర్రులో 37.4, బాపులపాడులో 32.8, గన్నవరంలో 29.2, గూడూరులో 27.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. గురువారం కోస్తాతీరం వెంబడి ఒక మోస్తరు వర్షం కురుస్తుందని, తీరం వెంబడి పలు ప్రాంతాల్లో ఈ నెల 15వ తేదీ వరకు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

(3వ పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలన సందర్భంగా గురువారం పోరంకి మురళీరిసార్ట్సులో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. సదరు సభ ఏర్పాట్లను బుధవారం మీనా పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాకపోకలు, భద్రతకు ఎలాంటి అంతరాయం కలుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్లానింగ్ ఫైనాన్స్ కార్యదర్శి అనంతశంకర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్లు గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు పాల్గొన్నారు.

సాగుపై సందిగ్ధం!

(3వ పేజీ తరువాయి)

దిగువకు పోదని, పొలాలు నారుమడుల దశలో, పైరు దశలో మునిగిపోతాయని ఆందోళన చెందుతున్నారు. మచిలీపట్నం మండలంలోని శివగంగ, తాళ్లపాలెం, లంకపల్లి డ్రెయినేజీల్లో గుర్రపు డెక్క పేరుకుపోయింది. అయినా ఈ డ్రెయినేజీల్లో ఓఅండ్‌ఎం పనులను నేటికీ ప్రారంభించలేదు. కంకిపాడు వద్ద బందరు కాలువ లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటికి కనీస మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు. వీటితో పాటు ప్రధాన కాలువలకు సంబంధించి రెగ్యులేటర్‌లు, లాకులు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బందరు కాలువలో పెరిగిన గుర్రపు డెక్క

యనమలకుదురు లాకుల వద్ద ప్రారంభమై మచిలీపట్నంలోని గిలకలదిండి వరకు 76 కిలోమీటర్ల మేర ప్రవహించి 1.25 లక్షల ఎకరాలకు సాగునీరందించే బందరు కాలువ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కాలువలోని పలు ప్రాంతాల్లో గుర్రపు డెక్క, నాచు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. మచిలీపట్నం మండలం మల్లవోలు లాకుల దిగువన సీతారామపురం వద్ద బందరు కాలువలో గుర్రపు డెక్క పెరిగి చుక్కనీరు దిగువకు వెళ్లడంలేదు. గుర్రపు డెక్కను తొలగించాలని నీటిపారుదలశాఖ అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. అయినా నేటివరకు ఈ పనులను ప్రారంభించలేదు. బందరు కాలువ స్థితి ఇలా ఉంటే ఈ ఏడాది పొలాలకు సాగునీరు అందడం కష్టమవుతుందని రైతులు అంటున్నారు. దివిసీమ ప్రాంతంలోని గుండేరు, చిల్లలవాగు తదితర డ్రెయినేజీల్లో ఇంతవరకు ఓఅండ్‌ఎం పనులను ప్రారంభించలేదు. వేసవిలోనే గుర్రపు డెక్క, తూడు, నాచులను తొలగించేందుకు రసాయనాలను పిచికారీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఈ తరహా పనులు చేయకపోవడం గమనార్హం. పూర్తిస్థాయిలో వర్షాలు కురిసిన తర్వాత పనులు ప్రారంభిస్తే ఉపయోగం ఉండదని ఘంటసాల మండల రైతులు అంటున్నారు.

సబ్సిడీ విత్తనాల ఊసేది?

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.62 లక్షల హెక్టార్లలో వరి సాగు జరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా. చెరకు 3,549, మినుము 1,340, వేరుశెనగ 724, పత్తి 298, వివిధ రకాల పంటలు 133 హెక్టార్లలో సాగు చేయనున్నారు. ఈ ఏడాది 11,600 క్వింటాళ్ల వరి విత్తనాలను క్వింటాలుకు రూ.500 సబ్సిడీగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 6,200 క్వింటాళ్ల విత్తనాలను ఆయా మండలాల్లోని వ్యవసాయశాఖ కార్యాలయాలకు పంపామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సబ్సిడీపై ఇచ్చే వరి విత్తనాలు ఇంకా అందుబాటులోకి రాలేదని రైతులు అంటున్నారు. కంకిపాడు, గన్నవరం, తోట్లవల్లూరు, ఉయ్యూరు, పామర్రు, చల్లపల్లి, మొవ్వ, తదితర మండలాల్లో బోరునీటి ఆధారంగా ఇప్పటికే 250 ఎకరాల్లో నారుమడులు పోశారు. కాలువలకు సాగునీటిని విడుదల చేస్తే గుడ్లవల్లేరు, పెడన, బంటుమిల్లి, గుడివాడ, గూడూరు, మచిలీపట్నం తదితర మండలాల్లో వెదజల్లే పద్ధతిన వరినాట్లు వేసేందుకు, నారుమడులు పోసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం మండలంలోని కేసరపల్లి-సావరగూడెం గ్రామాల మధ్య రూ.40 లక్షల అంచనాతో నూతనంగా నిర్మించనున్న రిటైనింగ్‌వాల్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.96లక్షల వ్యయంతో అల్లాపురం గ్రామం నుంచి పాలిటెక్నిక్ కాలేజ్ మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు దావాజీగూడెం గ్రామ పరిధిలో నిర్మించిన ఎన్‌టీటీఎఫ్ కాలేజీ రోడ్లకు ఆయన ప్రారంభోత్సవ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ గతేడాది వరదలు వచ్చినప్పుడు రిటైనింగ్ వాల్ లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ఈ వాల్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. గ్రామాల్లోని చెరువులు గ్రామ ప్రజల ఉమ్మడి ఆస్తి అని, పూడికతీత ద్వారా వచ్చిన మట్టి ఆ గ్రామ ప్రజల అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. చెరువుల్లో తవ్వకాలు నిర్వహించేవారు మీటరు కంటే ఎక్కువ లోతు తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని, లారీల్లో మట్టిని తరలింపునకు అనుమతి లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇప్పటివరకు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మట్టి అక్రమ తవ్వకాల ఆరోపణలపై స్పందిస్తూ ఆధారాలుంటే సమర్పించాలని తప్పకుండా కఠిన చర్యలు చేపడతామన్నారు. చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, గూడపాటి తులసీమోహన్, బోడపాటి రవికుమార్, మేడేపల్లి రమ, కాసర్నేని రంగబాబు, బీజేపీ నేతలు కుమారస్వామి, కానూరు శేష మాధవి, అధికారులు పాల్గొన్నారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఘంటసాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. దేవరకోట గ్రామంలో రైతు వేమూరి రత్నగిరిరావు పొలం వద్ద బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఎడ్లకు, నాగలికి ప్రత్యేక పూజలు చేసి నాగలి చేతపట్టి సంప్రదాయ పద్ధతిలో దుక్కి దున్ని విత్తనాలు చల్లి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో పాల్గొని ప్రసంగించారు. సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, జనసేన నేతలు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో 'దివి' సమగ్రాభివృద్ధి



అవనిగడ్డ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కుంటుపడిన నియోజకవర్గ అభివృద్ధి కూటమి ప్రభుత్వం వచ్చాయక పరుగులు పెడుతోందని తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరించడంతో పాటు పంట కాలువల్లో తూటుకాడ తొలగింపు పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఎదురుమొండి - ఏటిమొగ బ్రిడ్జి పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయని, రూ.109 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. అవనిగడ్డ - కోడూరు రహదారి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో నేడు పూర్తయిందని, త్వరలోనే ఘంటసాల, కొడాలి రహదారుల నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల కృషి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో అవనిగడ్డ నియోజకవర్గం రాబోయే నాలుగేళ్లలో అభివృద్ధి సాధించదగలదని గోవర్ధన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇదేం పద్ధతి?

(3వ పేజీ తరువాయి)

పంపుతుంటారు. ఇలా వచ్చిన వారికి ప్రొటోకాల్ విభాగంలో సిబ్బంది ఒక సహాయకుడిని ఇచ్చి దర్శనానికి పంపుతుంటారు. ఈ సిఫార్సు దర్శనాలు ఎక్కువ కావడంతో దుర్గగుడి అధికారులు కొన్నాళ్ల క్రితం ఒక నిర్ణయం తీసుకున్నారు. ఎంతమంది దర్శనానికి వస్తే అందులో సగం మందితో టికెట్లు కొనిపించాలని నిర్ణయించారు. ఒక సిఫార్సు లేఖపై నలుగురు వస్తే వారిలో ఇద్దరితో టికెట్లు కొనుగోలు చేయించి మిగిలిన ఇద్దరిని ఉచితంగా దర్శనానికి పంపుతున్నారు. ఇలా చేయడంతో దర్శనానికి వచ్చిన వారు ప్రొటోకాల్ ఆఫీస్ దగ్గర నుంచే సిఫార్సు చేసిన వారికి ఫోన్ చేసి టికెట్లు తీసుకోమంటున్నారని చెబుతున్నారు. సిఫార్సు చేసిన వారు సహాయకులపై చిందులు తొక్కడంతో సిబ్బంది చేసేదిలేక ఉచితంగానే అంతరాలయం దర్శనాలకు పంపుతున్నారు. ఇప్పుడు ఏకంగా సిఫార్సు లేఖలు ఇస్తున్న వారే భక్తులతో టికెట్లు కొనుగోలు చేయించవద్దని ఒక నోట్ పెడుతున్నారు. దేవస్థాన వర్గాల్లో ఇదిప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అంతరాలయం తప్ప మరో దర్శనం వద్దు

ప్రజాప్రతినిధులు, అధికారుల పేషీల సిఫార్సులతో వచ్చిన భక్తులు అంతరాలయం దర్శనానికి తప్ప మరో దర్శనం చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల సిఫారసుతో వచ్చినందున తమకు ప్రొటోకాల్ వర్తిస్తుందన్న భావనలో భక్తులు ఉంటున్నారు. దుర్గగుడికి ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ మూడు వారాల్లో రోజుకు 30 వేల నుంచి 40వేల మంది అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ఆలయంలో ఉచిత దర్శనం, రూ.100, రూ.300, రూ.500 దర్శనాలు ఉన్నాయి. ఇందులో రూ.500 టికెట్ తీసుకున్న భక్తులను అంతరాలయంలోకి అనుమతిస్తారు. రూ.300 టికెట్ ఉన్న భక్తులకు ముఖ మండప దర్శనం చేయిస్తారు. ఆలయంలో ఒక్కోసారి రూ.500 క్యూ రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో సిఫార్సులతో వచ్చిన వారిని రూ.300 క్యూలో పంపాలని ప్రొటోకాల్ సిబ్బంది భావిస్తుంటారు. అంతరాలయం క్యూ రద్దీగా ఉన్నందున ముఖ మండప దర్శనానికి వెళ్లాలని సిబ్బంది భక్తులకు సూచిస్తుంటారు. దీనికి వారు ససేమిరా అంటున్నారు. దీనితో వారిని ప్రముఖులను తీసుకువెళ్లే మార్గంలో దర్శనానికి పంపాల్సిన పరిస్థితి వస్తుంది. దీనిపై అప్పటి వరకు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడిన భక్తులు మండిపడుతున్నారు. ఈ భక్తులకు అంతరాలయం చేయించకపోతే సిఫార్సు చేసినవారి నుంచి చివాట్లు పడతాయి అన్న భయంతో తప్పక అంతరాలయంలోకి పంపుతున్నారు. దీనివల్ల ఇతర భక్తుల నిరసనను తాము ఎదుర్కోవాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. టికెట్లు తీసుకోవడం వల్ల వచ్చే ఆదాయం అమ్మవారి హుండీకే చెందుతుంది తప్ప తమ జేబులోకి రాదని ఆలయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

పునర్నిర్మాణం..

(3వ పేజీ తరువాయి)

వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టింది. మొత్తం 75 ఎకరాల విస్తీర్ణంలోని ప్లాంట్‌ను సన్నద్ధం చేసింది. బస్సుల బాడీ బిల్డింగ్‌కు అనుగుణంగా తీర్చిదిద్దిన తర్వాత ఉత్పాదకతను ప్రారంభించాలని నిర్ణయించింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అశోక్ లేల్యాండ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా స్థానికంగా ఉన్న 600 మందికి ఉద్యోగాలు లభించాయి. మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో అతి పెద్ద భారీ పరిశ్రమగా అశోక్ లేల్యాండ్ ఉత్పత్తి సాగిస్తోంది. ఈ ప్లాంట్ మళ్లీ ప్రారంభం కావడానికి ఎమ్మెల్యే యార్లగడ్డ విశేషమైన కృషి జరిపారు.

విజయవాడ మెట్రో పరుగులు!

వైసీపీ ప్రభుత్వంలో తొక్కిపట్టిన విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం రాగానే కదలిక వచ్చింది. విజయవాడ మెట్రో ప్రాజెక్టును మొదటి దశలో గన్నవరం నుంచి రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు మొత్తంగా 38.4 కిలోమీటర్ల పొడవున రెండు కారిడార్లను నిర్మించటానికి అడుగులు పడ్డాయి. ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించటంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. కేంద్ర ప్రభుత్వం కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కోసం కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ దిశగా అడుగులు వేసింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా యంత్రాంగాల స్థాయిలో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ ఎన్‌పీ రామకృష్ణారెడ్డి ఇప్పటికే చర్చలు జరిపారు. భూ సేకరణ నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం చేస్తున్నారు. మెట్రో ప్రాజెక్టుకు నూరుశాతం నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. భాగస్వామ్య విధానంలో చేద్దామని కేంద్రం ప్రతిపాదించింది. దీంతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు ప్రస్తుతం రుణ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. దాదాపుగా టెండర్ల దశకు చేరుకుంటోంది.

నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ సాకారం

కూటమి ప్రభుత్వం రాగానే కేంద్రం విజయవాడకు అతిపెద్ద ఫ్లై ఓవర్‌ను మంజూరు చేస్తూ శుభవార్త వినిపించింది. రూ.600 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్-16 మీద ఆరు వరసల విధానంలో నిర్మించేందుకు డీపీఆర్ కూడా పూర్తయింది. టెండర్లు పిలిచే దశలో.. ఇదే మార్గంలో మెట్రో కారిడార్ కూడా వస్తుండటంతో ఈ సమస్యను ఎలా అధిగమించాలన్న దానిపై ఎన్‌హెచ్, ఏపీఎంఆర్‌సీలు భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ మీద మెట్రో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేలా.. నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు 4.5 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు అడుగులు పడ్డాయి. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు సంబంధించి మెట్రో అధికారులు రూ.1000 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు వేసి మోర్తుకు పంపించారు. ఆమోదం రాగానే.. దీని పనులు మెట్రో కారిడార్-1లో భాగంగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులే చేపడతారు.

జెట్ సిటీకి పునర్వైభవం దిశగా అడుగులు

జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పని, నివాసం ఒకేచోట అన్న విధానంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 15 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 6,755 ఇళ్ల నిర్మాణ పనులతో పాటు, ఫ్యాక్టరీ ఫ్లాటెడ్ కాంపెక్స్-1 పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక జెట్ సిటీకి పునర్వైభవం దిశగా అడుగులు పడ్డాయి. ఫ్యాక్టరీ ఫ్లాటెడ్ కాంప్లెక్స్‌ను పూర్తి చేయటానికి ఆపెడ్కో, ఏపీఐఐసీలకు సంయుక్తంగా బాధ్యతలను అప్పగించింది.

ఎన్‌డీబీ రోడ్లకు శ్రీకారం

వైసీపీ ప్రభుత్వ హయాంలో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) నిధులతో తలపెట్టి అర్ధంతరంగా వదిలేసిన ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం రాగానే చర్యలు చేపట్టింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలో మొత్తం 13 ఆర్‌అండ్‌బీ రోడ్లను రెండు వరసలుగా విస్తరించేందుకు రూ.245 కోట్ల వ్యయంతో శ్రీకారం చుట్టగా, కేవలం మూడు రోడ్లనే అప్పట్లో చేపట్టడం జరిగింది. మిగిలిన 10 రోడ్ల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. కూటమి ప్రభుత్వం రాగానే.. ఎన్‌డీబీ పనులపై దృష్టి సారించటంతో ఉమ్మడి జిల్లాలో 10 ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులను ప్రారంభించారు. కాంట్రాక్టు సంస్థతో క్షేత్ర స్థాయిలో పనులు చేయిస్తోంది.

విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే

విజయవాడ - నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ - ఖమ్మం మధ్య తలపెట్టనున్న నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మూడేళ్ల ఎదురు చూపులు ఫలించాయి. కూటమి ప్రభుత్వం రాగానే భూ సేకరణ అంశంపై దృష్టి సారించటంతో 86శాతంపైగా భూములను అప్పగించటం జరిగింది. ఎన్‌హెచ్‌కు స్వాధీనం చేసిన భూముల్లో పనులు మొదలయ్యాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదికలో వైభవంగా నవగ్రహ హోమం

గన్నవరం జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ కల్యాణ వేదికలో బుధవారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో సుదర్శన నాగసింహ లక్ష్మీగణపతి దుర్గా లక్ష్మీ నవగ్రహ హోమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. కొమ్మమూరు సిద్ధాంతి రామకృష్ణ పాతియాజి శిష్య బృందం పర్యవేక్షణలో హోమాన్ని జరిపారు. తొలుత ఆలయంలో పూజలు చేశారు. ఈ ఏడాది రైతుల వేసే పంటలు సమృద్ధిగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని హోమం, పూజలు చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, కాసన్నేని రంగబాబు, తులసీమోహన్, ఆలయ కమిటీ సభ్యులు జాస్తి ఫణి శేఖర్, కాసన్నేని నాని, జాస్తి శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణు, చిమట శ్రీనివాసరావు, జొన్నలగడ్డ వెంకట్, ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కానూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మున్సిపల్ పరిధి కానూరులోని సూపర్‌విజ్ రోడ్డుకు బుధవారం తాడిగడప మున్సిపల్ ఈఈ భూషణం శంకుస్థాపన చేశారు. రూ. 74.7 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఈఈ భూషణం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాడిగడప మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



ఉయ్యూరులో పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

డ్రెయినేజీ, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఉయ్యూరు : ఉయ్యూరు నగర పంచాయతీ 6వ వార్డులో షుమారు రూ. 41 లక్షల అంచనాతో సీసీ డ్రైనేజి, రోడ్డు నిర్మాణానికి చైర్మన్ వి. సత్యనారాయణ బుధవారం భూమిపూజ చేశారు. నగర పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. వైస్ చైర్మన్ సురేష్, కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నున్న ఈవోగా సురేష్‌బాబు బాధ్యతల స్వీకరణ

విజయవాడ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కోట సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆకునూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సురేష్‌బాబు బదిలీపై నున్న గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం, వైసీపీ నేతలు ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు 14 నుంచి

గన్నవరం జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం, హనుమాన్‌జంక్షన్ బస్‌పాస్ కౌంటర్లలో విద్యార్థులకు ఈ నెల 14 నుంచి కొత్త బస్‌పాస్‌లు ఇస్తున్నట్లు డిపో మేనేజర్ పి శివాజీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు బస్ పాస్ వెబ్ సైట్‌లో వారి వివరాలను నింపుకొని బస్‌పాస్ కౌంటర్‌కు వస్తే వెంటనే బస్‌పాస్ ఇస్తారని తెలిపారు. 12 సంవత్సరాల లోపు బాలురకు, 18 సంవత్సరాల లోపు 10వ తరగతి వరకు బాలికలకు ఉచిత బస్‌పాస్‌లు ఇస్తారని, కాలేజీ విద్యార్థులకు కనెక్షన్ పాస్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా జ్యేష్ఠాభిషేకం

హనుమాన్‌జంక్షన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవ మూర్తులకు జ్యేష్ఠమాసం ప్రారంభం పురస్కరించుకొని బుధవారం విశేష అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రా వధానుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు విశేష ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకం జరిపారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ, స్థానిక పలువురు భక్తులు పూజా సామగ్రి, అభిషేక ద్రవ్యాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





కానూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుప్పలు.. గాంధీబొమ్మ సెంటర్ కరెంట్ ఆఫీస్‌రోడ్డులో..

చెత్తశుద్ధి ఏదీ!

- చెత్తకుప్పలతో దర్శనమిస్తోన్న కానూరు, గండిగుంట
- ముసురుతున్న ఈగలు, దోమలు
- దుర్గంధంతో తలలు పట్టుకుంటున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్, పంచాయతీ అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

(కానూరు /ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న కానూరులో పారిశుధ్య సమస్య నానాటికి జటిలంగా మారింది. గ్రామంలోని ఏప్రాంతంలో చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తోన్నాయి. మెయిన్‌రోడ్డుతోపాటు మిగిలిన రోడ్లపై కూడా చెత్తచెదారం పేరుకుపోయి దుర్వాసన కొడుతోంది. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కానూరులో అపరిశుభ్రతపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. మెయిన్‌రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, కరెంట్ ఆఫీస్‌రోడ్డు, ఉమాశంకర్ బస్టాప్, ఆర్టీసీ కాలనీతోపాటు పల కాలనీల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. అంతేగాక విజయవాడ- మచిలీపట్నం రోడ్డులో కానూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది కనీసం మెయిన్‌రోడ్లలో కూడా చెత్తను తొలగించలేని విధంగా ఉండటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పేరుకుపోతున్న చెత్తవల్ల అనారోగ్యం బారిన పడకముందే కానూరులో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ దృష్టిసారించి శానిటేషన్ అధికారులకు తగు సూచనలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

●గండిగుంట గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లపక్కన చెత్తకుప్పలు పేరుకుపోయి పారిశుధ్యం అధ్వాన స్థితికి చేరుకుంది. కాటూరు రోడ్డు జాతీయ రహదారి పక్కన అండర్ పాస్ సమీపాన సర్వీసు రోడ్డు పొడవునా చెత్తకుప్పలు పోయడంతో సర్వీసు రోడ్డు డంపింగ్ యార్డులా తయారై రోడ్డుపై వెళ్లేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామంలో ప్రధాన కూడళ్లతో పాటు, ఆనందపురంలో సర్వీసు రోడ్డు వెంబడి చినఓగిరాల సెంటర్ వరకు, కాటూరు రోడ్డులో ఆర్టీవో కార్యాలయానికి వెళ్లే గేటు సమీ పాన, రోడ్డు పొడవునా చెత్త కుప్పలు తొలగించక పోవడంతో కుళ్లి దుర్గంధం వ్యాపిస్తుంది. గ్రామ పరిధిలో పారిశుధ్యం అంతంత మాత్రంగా ఉన్నప్ప టికి పంచాయతీ అధికారులు పట్టించుకోపోవడం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంటింటా చెత్త సేకరణ ప్రతిరోజూ పక్కాగా చేపట్టాలన్న ప్రభుత్వ ఆదేశాలు అధికారులు అమలు చేయడం లేదు



గండిగుంట పంచాయతీ పరిధి కాటూరు రోడ్డు అండర్‌పాస్ సమీపాన సర్వీసు రోడ్డు పక్కన చెత్త

రోడ్ల సుందరీకరణకు సహకరించాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల సుందరీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వేలేరు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారి డివైడర్‌పై మంగళవారం రాత్రి ఆయన పూలమొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులతో లింకు రహదారులు ప్రమాద కరంగా తయారయ్యాయన్నారు. రహదారులపై గుం టలు లేకుండా మరమ్మతులకు, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయి ప్రజలకు అందు బాటులోకి వచ్చాయని, రహదారుల సుందరీకరణలో భాగంగా గ్రామపంచాయతీలకు మొక్కలు కేటాయించడం జరిగిందని, త్వరలోనే ప్రజా భాగస్వామ్యంతో మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, అట్లూరి శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వరరావు, కాజా సురేష్, అవిర్నేని భవానిశంకర్, ఈఓపీఆర్డీ లక్ష్మయ్య, ఈవోలు సురేష్, పూర్ణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వేలేరు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటా

పజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మల్లవల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు యనమదల వెంకయ్యారావును మంగళవారం రాత్రి ఆయన పరామర్శించారు. అత్యుత్తమ వైద్యం అందించడానికి అన్ని విధాల సహకరిస్తానని తెలిపారు. ఆయన వెంట చిరుమామిళ్ల సూర్యం, దయాల రాజేశ్వరరావు, అక్కినేని కృష్ణాజీ, చలసాని శ్రీనివాస్, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించాలి

ప్రసాదంపాడు : గన్నవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు సహకరించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. బుధవారం విజయవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అశోక్ లేలాండ్ సంస్థ ప్రతినిధుల బృందం యార్లగడ్డతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో అశోక్ లేలాండ్ హెడ్ సుమీ షరాఫ్, హెడ్ సోర్సింగ్ గణేష్ జయరామ్, చెన్నై కార్పొరేట్ ఆఫీస్ హెడ్ ప్రసాద్, హెచ్‌ఆర్ గోపీనాథ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుజనాచౌదరికి వల్లూరు పరామర్శ

పెనమలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సీనియర్ బీజేపీ నాయకులు వల్లూరు శ్రీమన్నారాయణ బుధవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరిని హైదరాబాద్‌లో కలిసి పరామర్శించారు. సుజనా ఆరోగ్యం పట్ల అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు నాగేశ్వరరావు ఉన్నారు.



ఎమ్మెల్యే సుజనాచౌదరిని కలిసిన వల్లూరు శ్రీమన్నారాయణ

గండిగుంటలో పంచాయతీ భూమి అన్యాక్రాంతం

- తప్పుడు సర్వే నంబరుతో తల్లి నుంచి వీలునామా పేరుతో రిజిస్ట్రేషన్

ఉయ్యూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు మండలం గండిగుంటలో గ్రామ పంచాయతీకి చెందిన గ్రామకంఠం భూమిని తప్పుడు సర్వే నంబరుతో ఓ వ్యక్తి తన తల్లి నుంచి వీలునామాతో రిజిస్ట్రర్ చేయించుకుని ప్రభుత్వ భూమిని అనుభవించేందుకు చేసిన కుట్ర ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గండిగుంట గ్రామ పరిధిలో 1072 సర్వే నంబరులో షుమారు 22 ఎకరాల గ్రామకంఠం భూమిలో ప్రధాన సెంటర్‌లో ఎన్టీఆర్ సర్కిల్, కోదండ రామాలయం సమీపాన ఉన్న షుమారు 10 సెంట్ల భూమిని ముక్కామల నిర్మలా కుమారి తన పూర్వార్జితం ఆస్తిగా నమోదు చేసి వీలునామారాసి 1072/1 సర్వేనంబరుతో 28-8-2024న ఉయ్యూరు సబ్ రిజి స్ట్రార్ కార్యాలయంలో 163/ బికే3/2024 నంబరుతో తన కుమారుడు శాయోజీ రావుకు వీలునామా రిజిస్ట్రర్ చేశారు. ఈస్థలంపై గతంలో పలు మార్లు వివాదాలు జరిగినప్పటికి అధికారులను ప్రసన్నం చేసుకుని రిజిస్ట్రేషన్ వ్యవహారమంతా చక్కదిద్దుకోవడం విశేషం. షుమారు రూ, 50 లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవడంపై అధికారులను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ కార్యదర్శికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాయోజీరావు రిజిస్ట్రర్ చేయించుకున్న పంచాయతీ స్థలాన్ని డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శితో కలసి మంగళవారం పరిశీలించారు.



గండిగుంటలో అన్యాక్రాంతమైన గ్రామకంఠం పంచాయతీ భూమి

వ్యవసాయ రుణాల మంజూరుకు ఎస్‌బీఐ అధిక ప్రాధాన్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సాగు ద్వారా రైతులు ఆర్థిక స్వావలంబనకు ఎస్‌బీఐ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రీజనల్ మేనేజర్ ఆర్. రాఘవరావు తెలిపారు. రంగన్నగూడెంలో ఎస్‌బీఐ హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వ్యవసాయ రుణాలపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఎస్ఎస్ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ హనుమాన్‌జంక్షన్ శాఖలో రద్దీకి అనుగుణంగా వ్యవసాయదారులకు, డ్వాక్రా మహిళలకు వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చీఫ్ మేనేజర్ బి.రామారావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి పేరు నమోదులో అంగన్వాడీ నిర్లక్ష్యం

విజయవాడ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గర్భిణులకు పౌష్టికారం అందిచాలన్న ఉద్దేశంతో విస్తృత ప్రచారం చేస్తుంటే.. కొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది వారి పేర్లు నమోదు చేసుకోవాలంటే ఆంక్షలు చెప్పి, నమో దు చేసుకోకుండా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పది రోజుల క్రితం ఒక గర్భిణి నున్నలోని వెల్‌నెస్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకున్న తరువాత పౌష్టికాహారం కోసం అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అందులో భాగంగా గర్భిణి నున్నలోని బోడపాడు అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదుకు వెళితే మీరు ఎక్కడ ఉంటారు. నెలకు రెండుసార్లు రావాలి. యాప్ అప్‌డేట్ కావడంలేదు అంటూ యక్షప్రశ్నలు వేసి చివరకు పేరు నమోదు చేసుకోకుండానే పంపించి వేశారు. ఆ గర్భిణినే బుధవారం మరలా అంగన్వాడీ కేంద్రానికి వెళితే నీవు ఎక్కడి నుంచో రావాలి. ఇబ్బంది పడతావు. అంటూ పాతసాకులే చెప్పి పేరు నమోదు చేసుకుండా వెనుకకు పంపించే ప్రయత్నం చేశారు.



ఆదాయ వనరుల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


హనుమాన్‌జంక్షన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతులు మెరుగు పరచడంతో పాటు ప్రతి శాఖ తమ ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం ఆధీనంలోని యనమదల రామస్వామి సత్రం ఆవరణలె రూ. 29 లక్షలు వ్యయంతో నూతనంగా నిర్మించిన మూడు దుకాణాల సముదాయాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. దీనికి ముందు ఆయన ఆలయంలో అభయాంజనేయస్వామిని దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, పావులూరి రామారావు, వడ్డి వాసవి, గరికపాటి నాగేశ్వరరావు, బెక్కం లక్ష్మీనారాయణ, దేవస్థానం ఈవో తారకేశ్వరరావు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రసాదంపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడు పంచాయతీ పరిధిలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పంచాయతీ నిధులు రూ. 20 లక్షలతో చేపట్టనున్నట్టు కార్యదర్శి గంటా రామ్మోహనరావు తెలిపారు. బుధవారం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ శ్మశాన వాటికలో బిల్డింగ్ ప్లాస్టింగ్ పనులు, దహన సంస్కారాలకు కావాల్సిన గ్రీల్స్ వంటి పలు అభివృద్ధి పనులకు నిధులు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. ముస్లిం శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఆ పనుల కోసం రూ.8.50లక్షలు వెచ్చించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అద్దేపల్లి సాంబశివరావు, మాజీ ఉప సర్పంచ్, గ్రామ టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్, టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
12 జూన్ 2025

అభిరుచి



అలనాటి అరుదైన నటి సూర్యకాంతం. పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి... మరెవరికీ సాధ్యంకాదన్న రీతిలో అభినయించి... తెలుగు తెరపై తనదైన ముద్ర వేశారు. ఇది దశాబ్దాల కిందటి కథ. మళ్లీ ఇప్పుడు ఆ నట విన్యాసాన్ని అనుకరించి... సూర్యకాంతాన్ని మరిపించి... తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోంది... మంజూష ముక్కవిల్లి. వెండితెరపై నాటి అపురూప సన్నివేశాలను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో పండించి... టాలీవుడ్ తారల ప్రశంసలు సైతం అందుకున్న మంజూషతో 'నవ్య' ముచ్చట్లు.

అచ్చం సూర్యకాంతంలా!

"ఒక అభిరుచి... చిన్నప్పుడే నాలో బలంగా నాటుకుపోయింది. అది మరేదో కాదు... నటించాలన్న తపన. నాకు తెలియకుండానే నాలోని నటుణ్ణి బయటకు తీసే ప్రయత్నం ఎప్పటికప్పుడూ చేస్తూనే ఉన్నాను. బడికి వెళ్లే రోజుల్లో... కాలేజీలో చదివే సమయంలో... అవకాశం దొరికినప్పుడల్లా అలనాటి మేటి తారల్లా అభినయిస్తూ వస్తున్నాను. నటులే కాదు... ఇంట్లోవాళ్లు, సన్నిహితులను అనుకరించడం కూడా నాకు ఒక అలవాటుగా మారిపోయింది. అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు... ఇలా పెద్దవాళ్ల హావభావాలను సరదాగా నాలో పలికిస్తుండేదాన్ని. దాంతోపాటు పాటలు పాడేదాన్ని. డ్యాన్స్ చేసేదాన్ని. చూసినవాళ్లందరూ బాగా ఆస్వాదించేవారు. అభినందించేవారు. వారి పొగడ్తలు నాకు మరింత ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేవి. అలా మొదలైంది నా ఈ ప్రయాణం. మా ఊరు భద్రాచలం. నేను అక్కడే పుట్టి పెరిగాను. 2010లో హైదరాబాద్‌లో ఎంబీయే పూర్తయింది.

ఉద్యోగం... పెళ్లి...

డిగ్రీ అవ్వగానే ఓ ఆంగ్ల పత్రికలో ఏడాదిన్నర సేల్స్, మార్కెటింగ్ విభాగంలో పని చేశాను. తరువాత ఆరేళ్లు రేడియో సిటీలో ఉద్యోగం. అక్కడ మార్కెటింగ్‌తో పాటు ప్రకటనలకు వాయిస్ ఓవర్ ఇచ్చేదాన్ని. అదే సమయంలో నాకు పెళ్లయింది. మావారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. తన ఉద్యోగ నిమిత్తం ఫ్రాన్స్‌కు వెళ్లాం. కొన్నాళ్లకు తిరిగి భారత్‌కు వచ్చేశాం. ఆయనకు మంచి ఉద్యోగ అవకాశం రావడంతో 2021లో అమెరికాకు పయనమయ్యాం. ప్రస్తుతం ఇక్కడే నివాసం.

అమెరికా వచ్చాక...

మొదటి నుంచీ అందర్నీ అనుకరించడంవల్ల క్రమంగా నా ఆసక్తి నటన వైపు మళ్లింది. అమెరికా వచ్చాక అనిపించింది... ఒక ప్రయత్నం చేద్దామని. ఒకప్పుడంటే సినిమాలు, టీవీలు మినహా వేరే అవకాశాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వల్ల మన ప్రతిభ ప్రపంచానికి చూపడానికి అనువైన ఒక చక్కని వేదిక అందుబాటులో ఉంది కదా. దాని ద్వారా నాలోని నటిని సంతృప్తి పరచాలని అనుకున్నా. చిన్నప్పటి నుంచీ ఇమిటేట్ చేస్తున్నాను కాబట్టి... కంటెంట్ కూడా దానికి సంబంధించే పెట్టాలనుకున్నా. అలా మూడేళ్ల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో నా పేరు మీదనే ఒక చానల్ ప్రారంభించాను.

నిర్మలమ్మ గారి రీల్‌తో...

చదువుకొనే రోజుల్లో డ్రామా, డ్యాన్స్ ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. కాలేజీలోనే కాదు... బయటి వేదికలపై కూడా. కానీ ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. అన్నీ నాకు నేను చూసి నేర్చుకున్నవే. ఇన్‌స్టాలో చిన్న చిన్న వీడియోలు చేసి పెట్టాను కానీ... వాటికి అంత గుర్తింపు రాలేదు. 'శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్' చిత్రంలో నిర్మలమ్మ గారు నటించిన కోడి సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ బిట్ నేను చేశాను. దానికి మంచి స్పందన వచ్చింది. లక్షల మంది వీక్షించారు. అంతకు మించి షేర్ చేశారు. నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆ ఉత్సాహంతో సూర్యకాంతం గారిని అనుకరించే ధైర్యం చేశా.

'ఏంటి నేను ఇంత లావున్నానా'...

అయితే నాకు బాగా పేరు వచ్చింది మాత్రం సూర్యకాంతం గారి వీడియోతో. రేలంగి గారితో కలిసి ఆమె నటించిన 'ఏంటి నేను ఇంత లావున్నానా' సన్నివేశం ఒకటి ప్రయత్నించాను. ఆ రీల్‌కు ఊహించనంత స్పందన లభించింది. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. నాకు బాగా పేరు వచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ వీడియో పెట్టినా లక్షల్లో వ్యూస్. తరువాత ఛాయాదేవి గారిని అనుకరించాను. వాటికీ విపరీతమైన ఆదరణ లభించింది. వాస్తవానికి ఆ సలహా ఇచ్చింది రఘు కుంచె గారు. 'మీరు ఛాయాదేవి గారి పాత్రలు కూడా ప్రయత్నించండి. బాగా చేస్తారు' అన్నారు. ఆయన చెప్పాకే ఆవిడవి మొదలుపెట్టాను.

ఐదు వందలకు పైనే...

ఇప్పటివరకు నేను ఐదు వందలకు పైగా వీడియోలు చేశాను. ఇన్‌స్టాలో లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధికంగా చూసిన వీడియో సూర్యకాంతం గారిది. దానికి వ్యూస్ రెండు కోట్లు దాటాయి. ఆ తరువాత వరుసలో బ్రహ్మానందం, నిర్మలమ్మ, ఛాయాదేవి గారి వీడియోలు. అన్నీ నా మొబైల్ ఫోన్‌తోనే తీస్తాను. ముందుగా సన్నివేశం ఏంటనేది నిర్ణయించుకొని, ఓ అరగంట సాధన చేసి, నటిస్తాను. ఎడిటింగ్ లాంటివన్నీ నేనే చూసుకొంటాను. ఒక్కో వీడియోకు సగటున ఐదు లక్షల వ్యూస్ వస్తాయి. కాస్ట్యూమ్స్ ఇంట్లో ఉన్నవాటితోనే సరిపెడుతుంటా. అవి కుదరకపోతే షాపింగ్ చేస్తాను. కొన్ని భారత్ నుంచి కూడా తెప్పిస్తుంటాను. ఇక్కడ ఒక్కటే చెప్పదలుచుకున్నాను... సామాజిక మాధ్యమాలవల్ల ప్రతికూలతలు, అలాగే అనుకూలతలు కూడా ఉన్నాయి. దాన్ని మనం ఎలా ఉపయోగించుకొంటామనేది ముఖ్యం. ఒకప్పుడు నేరుగా వెళ్లి వేషాలు అడగాలంటే భయపడేదాన్ని. కానీ రీల్స్ వల్ల నాకు ఆ భయం పోయింది. నన్ను నేను ప్రపంచానికి పరిచయం చేసుకోగలిగాను. ఇది నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది. కాస్త గర్వంగానూ అనిపిస్తుంది."

● హనుమా

మధుర జ్ఞాపకాలెన్నో...



ప్రముఖ నటుడు హర్షవర్ధన్ గారు ఒక ఇంటర్వ్యూలో నా గురించి ప్రత్యేకంగా చెప్పారు. సూర్యకాంతంలా బాగా నటిస్తున్నానని. ఆ వీడియో ఎవరో నాకు పంపించారు. చూసి ఆశ్చర్యపోయాను. ఆయనతో నాకు పరిచయం లేదు. ఒక మెసేజ్ కూడా పంపారు... 'ఆ బాడీ లాంగ్వేజ్, ఆ వాయిస్ అనుకరణ అంత సులువు కాదు. కానీ మీరు సూర్యకాంతంలా అతికినట్టు చేస్తున్నారు. నేను మీకు పెద్ద అభిమానిని. మా కుటుంబం అంతా కూర్చొని మీ వీడియోలు చూస్తాం' అని. అలాగే సంగీత దర్శకుడు తమన్ తన ఇన్‌స్టా స్టోరీలో నా వీడియోలు షేర్ చేశారు. చార్మి, అవసరాల శ్రీనివాస్, నందినీరెడ్డి లాంటి పరిశ్రమ ప్రముఖులు అభినందన మెసేజ్‌లు పంపడమే కాదు, వాటిని ఇతర సామాజిక మాధ్యమాల్లో పంచుకొంటున్నారు కూడా. కొంత మంది అసిస్టెంట్ డైరెక్టర్‌లు, సినిమాటోగ్రాఫర్‌లు 'అవకాశం వస్తే సినిమాల్లో నటిస్తారా' అని అడుగుతున్నారు. తప్పకుండా చేస్తానని వారికి చెప్పాను. నా లక్ష్యం కూడా అదే.

అదే నా బలం...

నేను చిన్నప్పటి నుంచీ సూర్యకాంతం, నిర్మలమ్మ సినిమాలు ఆసక్తిగా చూసేదాన్ని. దాంతో వాళ్ల నటన మీద కొంత అవగాహన వచ్చింది. ప్రత్యేకించి సూర్యకాంతాన్ని అనుకరించడం చాలా కష్టమనేది చాలామంది చెప్పే మాట. ఆవిడ డైలాగ్ డెలివరీ వేగంగా సాగిపోతుంది. డైలాగ్‌కు డైలాగ్‌కు మధ్య విరామం ఉండదు. నటనలో, మాటలో ఫోర్స్ ఉంటుంది. కానీ ఏదీ తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, ఎంతో సహజంగా అనిపిస్తుంది. ఇంకో ప్రత్యేకత ఏంటంటే... నిలుచున్న మనిషి నిలుచున్నట్టే, కదలకుండా డైలాగులు చెప్పేస్తారు. అలా మా ఇంట్లో నాయనమ్మలు, అమ్మమ్మలను చూసేదాన్ని. వాళ్లను అనుకరించడంవల్ల ఇప్పుడు నేను ఇంత బాగా చేయగలుగుతున్నాను. కాంచన, భానుమతి, బ్రహ్మానందం, కొవ్వై సరళ, ఆమని, సౌందర్య తదితరులని కూడా అనుకరిస్తుంటాను. ఎవరినైనా చూస్తే వారి హావభావాలను వెంటనే పట్టేయగలను. అదే నా బలం.

కౌన్సెలింగ్

పసికందులకు ఎలాంటి ఘనాహారం?

Q A

డాక్టర్! మా బాబుకు ఐదో నెల. ఆరో నెల నుంచి ఘనాహారం మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. బిడ్డకు ఏడాది వయసొచ్చేవరకూ ఎలాంటి ఆహారం అందించాలో వివరించగలరు? - ఓ సోదరి, హైదరాబాద్

ఆరో నెల నుంచి సాధారణంగా అన్నంలో పప్పు, నెయ్యి కలిపి తినిపించడం మొదలు పెడతాం! కానీ వీటి ద్వారా బిడ్డకు అందే పోషకాలు అతి స్వల్పం. కాబట్టి...

- పప్పుధాన్యాలు, అన్ని రకాల కూరగాయలు, పులుపు లేని పళ్లు తినిపించాలి. రుచి కోసం చాలా పరిమితంగా నెయ్యి వాడొచ్చు. లేదంటే ఏదైనా వెజిటబుల్ ఆయిల్ అయినా అన్నంలో కలిపి పెట్టొచ్చు.
- ఉప్పు, తీపి... ఈ రెండూ రుచిని పెంచే మాట నిజమే అయినా, పసికందులకు వీటిని అలవాటు చేయకూడదు. వీటికి బదులుగా రుచి కోసం పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ధనియాల పొడులను వంటకాల్లో కలిపి తినిపిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- తీపి పెట్టాలనుకుంటే తగు మాత్రంగా బెల్లం వాడొచ్చు. నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే బెల్లం లేదా పళ్ల ముక్కలు వేసి తాగించవచ్చు.
- తొమ్మిదో నెల నుంచి గుడ్డు పచ్చసొన తినిపించవచ్చు.
- ఉడికించే ఆహారం మెత్తగా ఉండాలి.
- ప్రతి పూటా అన్నమే తినిపించాలని లేదు. అన్నం బదులు కూరగాయ ముక్కలను తగుపాళ్లలో మసాలాలు జోడించి తినిపించవచ్చు. ఉడికించి, చిదిమిన పళ్ల ముక్కలు తినిపించవచ్చు.



- పెద్దలతో సమానంగా పిల్లలూ మూడు పూటలు తినాలి అనుకుంటే పొరపాటు. ఒకేసారి ఎక్కువ పరిమాణాల్లో పిల్లలు తినలేకపోతే, అదే పరిమాణాన్ని 6 భాగాలుగా వేర్వేరు సమయాల్లో తినిపించవచ్చు.
- సెరెలాక్ లాంటి ప్రత్యామ్నాయ మిల్క్ ఫుడ్స్, ప్రయాణాల్లో, ఇంటి భోజనం వండలేని సమయాల్లో మాత్రమే ఇవ్వాలి. దీన్లో చక్కెర కలపకూడదు.

ఇవి కూడదు...

పిల్లలకు తినిపించకూడని పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటంటే..

- అలర్జీ తలెత్తకుండా ఉండడం కోసం కొత్తగా ఏ రెండు కొత్త పదార్థాలను కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటిగానే రుచి అలవాటు చేయాలి.
- ఈ వయసు పిల్లలకు నట్స్ నుంచి అలర్జీ లాంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి వేరుశనగ, బాదం, జీడిపప్పు లాంటివి పొడి రూపంలో కూడా తినిపించకూడదు.
- సంవత్సరం లోపు పిల్లలకు తేనె, ఉప్పు, చక్కెర తినిపించకపోవడమే మంచిది. తీయదనం కోసం బెల్లం వాడొచ్చు.
- బాస్మతి లాంటి పాలిష్ పట్టిన బియ్యం వాడకూడదు.
- ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు ఇవ్వకూడదు. - **డాక్టర్ సుమతి,** పిడియాట్రిషియన్, హైదరాబాద్

చెద పురుగులు పట్టాయా?

కంప్యూటర్ టేబుల్, డైనింగ్ టేబుల్ వద్ద కలరా వుండలు ఉంచితే చెద పురుగులు చేరవు.

మన ఇంట్లో చెక్క అల్మారాలు, మంచాలు, తలుపులకు చెద పురుగులు పడుతూ ఉంటాయి. ఎంతో ఖరీదైన చెక్కను తెచ్చి ఇష్టంగా చేయించుకున్న అరలతో సహా పుస్తకాలు, దుస్తులను కూడా ఇవి పాడుచేస్తుంటాయి. ఒకసారి చేరితే వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. రసాయనాలతో కూడిన స్ప్రేలకు బదులు కొన్ని ఇంటి చిట్కాలు ఉపయోగించి కొంతమేరకు వీటి బెడదను తగ్గించుకోవచ్చు.

- చెద పురుగులను నివారించడంలో కర్పూరం పొడి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇవి ఎక్కువగా చేరే మంచాలు, తలుపులు, కిటికీలు, అరల మూలల్లో సందుల్లో కర్పూరం పొడిని చల్లితే రెండు రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.
- ముదురు వేపాకులను తెచ్చి ఎండబెట్టి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని గది మూలల్లో, అరల్లో, చెక్క సమాన్ల మీద చల్లితే వారం రోజుల్లో చెద పురుగులన్నీ చనిపోతాయి.
- పుస్తకాలు, దుస్తులు భద్రపరచుకునే చెక్క బీరువాల్లో; చెదపురుగులు ఉన్నాయన్న అనుమానం వచ్చిన ప్రదేశాల్లో చిటికెడు నల్ల జీలకర్ర ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- మంచాలు, సోఫాలు, టేబుళ్లు, కుర్చీల మీద కొద్దిగా వెనిగర్ చిలకరిస్తే ప్రయోజనం ఉంటుంది.
- ఇంట్లో ఉండే సామాన్లు, పుస్తకాలను ఎక్కువకాలం ఒకేచోట ఉంచకుండా కనీసం ఆర్నెల్లకోసారి కదిలిస్తూ ప్రదేశాలు మారుస్తూ ఉంటే చెదలు చేరవు.



లీచీ.. ఔషధ గుణాలెన్నో



ఎర్రగా చూడగానే తినేయాలనిపించే లీచీ పండు వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..

- లీచీల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తికి ఊతమిస్తుంది.
- ఈ పళ్లలోని ఫైబర్ అజీర్తి, మలబద్ధకం సమస్యలను దూరం చేస్తుంది.
- లీచీల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి డీహైడ్రేషన్ ముప్పు తప్పుతుంది.
- లిచి పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను ఇది దరిచేరనీయదు.
- లీచీల్లో క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు నియంత్రణకు ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి.
- ఇందులోని విటమిన్ సి, యాంటిఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వంటగది శుభ్రం ఇలా..

అద్దంలా మెరిసే వంటగది అహ్లాదకరంగా ఉంటుంది. వంటగది పరిశుభ్రంగా లేకపోతే క్రిమి కీటకాలు చేరడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వంట చేసేటప్పుడు చికాకుగా అనిపిస్తుంటుంది. కాబట్టి ఇంట్లో దొరికే వస్తువులతో సులువుగా వంటగదిని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం....

- వంట చేసేటప్పుడు వెలువడే పొగ, ఆవిరి వల్ల స్టవ్ వెనక గోడపై అమర్చిన టైల్స్ మీద జిడ్డు చేరుతూ ఉంటుంది. ఒక్కోసారి పసుపు, కారం, మసాలాల మరకలు కూడా పడుతుంటాయి. అలాంటప్పుడు ఒక గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని టైల్స్ మీద రాసి రెండు నిమిషాల తరవాత స్క్రబ్బర్ లేదా స్పాంజ్‌తో రుద్దాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే టైల్స్ చక్కగా శుభ్రమవుతాయి. వంట పూర్తయిన వెంటనే టిష్యూ పేపర్‌తో టైల్స్‌ని తుడిచేస్తే ఏ సమస్యా ఉండదు.



- వంట చేస్తున్నప్పుడు స్టవ్ కింద, దాని చుట్టూ కూడా ఆహార పదార్థాలు చింది పడుతూ ఉంటాయి. వంట పూర్తయిన తరవాత వీటిని పలుచని గుడ్డతో శుభ్రంగా తుడవాలి. రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల వెనిగర్ లేదా లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గట్టు మీద చల్లి పది నిమిషాలు ఉంచాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగేస్తే గట్టు పూర్తిగా శుభ్రపడుతుంది. ఇదేవిధంగా స్టవ్‌ని కూడా శుభ్రం చేయవచ్చు.
- వంటగదిలో ఉండే ట్యూబ్‌లైట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, స్విచ్ బోర్డులతోపాటు కిటికీ ఊచలు, తలుపులు కూడా జిడ్డు పట్టి దుమ్ము, ధూళితో నిండుతుంటాయి. అలాంటప్పుడు సర్ఫ్ లేదా లిక్విడ్ సోప్ కలిపిన నీళ్లలో ముంచి గట్టిగా పిండిన స్పాంజ్‌తో వీటిని తుడిచేస్తే సరిపోతుంది.
- అటకమీద, అరల్లో తరచూ బూజు పడుతూ ఉంటుంది. దీన్ని మెత్తని చీపురు లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. అరల మూలల్లో కర్పూరం బిళ్లలు, లవంగాలు, వేపాకుల్లో ఒకటి ఉంచితే బొద్దింకలు చేరవు.
- వంటగదిలో నేలను ప్రతిరోజూ ఉప్పునీటితో తుడవాలి. పాత్రలు కడిగే సింక్‌లో కొన్ని వేడి నీళ్లు పోసి బ్రష్‌తో రుద్ది శుభ్రం చేయాలి.

స్ఫూర్తి

డైవింగ్ సంచలనం



ఎలాంటి పరికరాలు లేకుండా ఊపిరి బిగపట్టి లోతైన నీళ్లలోకి డైవ్ చేయడమే ఫ్రీ డైవింగ్. ఎంతో కష్టమైన, క్లిష్టమైన ఈ క్రీడలో పైచేయి సాధించడమే కాకుండా, ఏకంగా తొమ్మిది జాతీయ రికార్డులను నెలకొల్పారు చెన్నైకి చెందిన 32 ఏళ్ల అర్చన శంకర నారాయణన్. ఈ మహిళా డైవర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.

ఆరేళ్ల కిందట... కొత్త సంవత్సర వేడుకల కోసం అండమాన్‌కు వెళ్లినప్పుడు, అర్చనకు మొదటిసారిగా డైవింగ్ చేసే అవకాశం దొరికింది. అలా జీవితంలో మొదటిసారిగా స్కూబా డైవింగ్ చేశారామె. ఆ అనుభవం గురించి వివరిస్తూ... "నాకా అనుభవం ఎంతో బాగా నచ్చింది. నీటి అడుగున దాగి ఉండే అద్భుతమైన ప్రపంచాన్ని నేనప్పుడు మొదటిసారిగా చూడగలిగాను. సముద్రంతో తక్షణ అనుబంధం ఏర్పడిపోయిన భావనకు లోనయ్యాను. నీటి ప్రపంచంలో నెలకొని ఉండే ప్రశాంతత, నిశ్శబ్దం నన్నెంతో అబ్బురపరిచాయి. అలా మొదటి అనుభవంతోనే డైవింగ్‌కు ఎంతో దగ్గరైపోయాను. నా భవిష్యత్తు డైవింగ్‌తో ముడిపడి ఉందని అనిపించింది. కానీ అప్పటికే న్యాయవాద వృత్తిలో ఉన్నాను. కాబట్టి డైవింగ్ పట్ల ఏర్పడిన మక్కువను నా తల్లితండ్రులు అర్థం చేసుకోలేకపోయారు. అది ప్రాణాంతకమైన క్రీడ కాబట్టి వాళ్లు బాగా భయపడిపోయారు. మాది సంప్రదాయ తమిళ కుటుంబం. న్యాయవాద వృత్తిని వదిలేసి, ప్రాణాంతకమైన డైవింగ్‌లో కొనసాగాలనే నా కోరికను మొదట్లో వ్యతిరేకించిన తల్లితండ్రులు చివరకు అర్థం చేసుకుని ప్రోత్సహించారు. ఇప్పుడు నన్ను చూసి గర్వపడుతున్నారు" అంటూ తన డైవింగ్ ప్రయాణాన్ని వివరిస్తున్నారు అర్చన.

ఫ్రీడైవింగ్... అంత సులువు కాదు

నీళ్ల అడుగుకి డైవ్ చేయడం, సులభతరమైన క్రీడలాగే అనిపించవచ్చు. కానీ నీళ్లలో లోతుకు ప్రయాణించేకొద్దీ నీటి ఒత్తిడి పెరిగిపోతుంది. ఆక్సిజన్ మోతాదులు తగ్గిపోతాయి. దాంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందక స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పెరిగి, అవి కుంచించుకుపోతాయి. నీటి ఒత్తిడిలో చోటుచేసుకునే మార్పుల వల్ల కళ్లు, చెవులు, సైనస్‌లు, ఊపిరితిత్తులకు గాయలయ్యే అవకాశాలుంటాయి. లోతుకు చేరుకున్న తర్వాత అంతే వేగంగా నీళ్ల పైకి చేరుకునే వీలుండదు. అలా లోతు నుంచి వేగంగా నీటి పైకి ప్రయాణిస్తే, రక్తంలో నైట్రోజన్ బుడగలు ఏర్పడి, డీకంప్రెషన్ సిక్‌నెస్‌కు గురవుతారు.

లోతులన్నీ నెగ్గి...

అర్చన తాజాగా ఫిలిప్పైన్స్‌లో జరిగిన రెండు ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఆరు కొత్త జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఈ చెన్నై యువతి, రెండు అంతర్జాతీయ పోటీల్లో ఆరు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు, 35 మీటర్ల జాతీయ రికార్డును నెలకొల్పి, 42 మీటర్ల ఫ్రీడైవింగ్ తో స్వీయ వ్యక్తిగత ప్రతిభను కనబరచడం విశేషం. ఇలా ఏడాది వ్యవధిలో తొమ్మిది రికార్డులను నెలకొల్పిన తొలి భారతీయ మహిళా ఫ్రీడైవర్‌గా చరిత్ర సృష్టించారు. ఫ్రీడైవింగ్ ఊపిరిని బిగపట్టే క్రీడ. ఈ క్రీడలో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి శ్వాస పరికరాలు లేకుండా, నీటి అడుగున వీలైనంత లోతుకు ఫ్రీడైవింగ్ చేస్తూ ఉంటారు. అర్చన, గత నెలలో ఫిలిప్పైన్స్‌లోని మబినిలో జరిగిన ఎఐడిఎ మబిని డెప్త్ క్వెస్ట్‌లో పాల్గొని, తన రికార్డును బద్దలు కొట్టడంతో పాటు నాలుగు జాతీయ రికార్డులతో తన అసమానమైన ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ఫిలిప్పీన్స్ పాంగ్లోలో జరిగిన హగ్ కప్ పోటీల్లో, మరొక సొంత రికార్డుతో పాటు, రెండు జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఇలా ఇప్పటివరకూ అర్చన, కాన్‌స్టెంట్ వెయిట్, కాన్‌స్టెంట్ వెయిట్ బై ఫిన్స్, కాన్‌స్టెంట్ వెయిట్ నో ఫిన్స్, ఫ్రీ ఇమ్మర్షన్... ఇలా ఈ క్రీడలోని నాలుగు డెప్త్ విభాగాల్లో జాతీయ రికార్డులను సాధించి భారత దేశ సత్తాను చాటారు.

మక్కువతో మథించి...

ఆ ప్రయాణంలో భాగంగా మొదట బహిరంగ జలాల స్కూబా అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్‌ను పొంది, రెస్క్యూ డైవర్‌గా మారారు. ఆ తర్వాత, ఎటువంటి ఆక్సిజన్ ఆసరా లేకుండా ఫ్రీడైవింగ్ చేసే భారత దేశానికి చెందిన శుభమ్ పాండే వీడియోలు చూసి అతని నుంచి ఎంతో ప్రేరణ పొందారు. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ.. "నన్నీ క్రీడ విపరీతంగా ఆకర్షించింది. కేవలం రెస్క్యూ డైవర్‌గా స్థిరపడిపోకుండా, ఈ క్రీడలో మరింత పరిణతి సాధించాలని అనుకున్నాను. శుభమ్ వీడియోలు చూసిన తర్వాత, అతని దగ్గర శిక్షణ పొందాలని అనిపించింది. దాంతో బాలి వెళ్లి, భారతీయ అగ్ర ఫ్రీడైవింగ్ శిక్షకుల్లో ఒకడైన శుభమ్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత, ఆసియాలోని సుప్రసిద్ధ ఫ్రీడైవింగ్ స్కూల్, అప్నియా బాలిలో కూడా శిక్షణ పొందాను" అంటూ చెప్పుకొచ్చారు అర్చన. శిక్షణలో భాగంగా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం విజువలైజేషన్, బ్రెత్‌వర్క్, ధ్యానం... సాధన చేశారామె. డయాఫ్రమ్ బ్రీదింగ్ లాంటి శ్వాస నైపుణ్యాలను సాధన చేయడం ద్వారా డైవింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, మహాసముద్రంలో ఆత్మవిశ్వాసంతో డైవింగ్ చేయగలిగే సామర్థ్యం కూడా పెరిగిందని అంటున్నారామె. అలాగే థాయిల్యాండ్‌లోని కొ టావోలో క్రైజెన్ ఫ్రీడైవింగ్‌లో కూడా అర్చన శిక్షణ తీసుకున్నారు. ఫ్రీడైవింగ్ ప్రపంచ రికార్డులు, 100 మీటర్లను అధిగమించాయి కాబట్టి భారతదేశ డైవర్లు ఈ క్రీడలో పైచేయి సాధించడానికి కఠోర శిక్షణ పొందడం అవసరమని గ్రహించిన అర్చన, ప్రస్తుతం తన శిక్షణ తీవ్రతను పెంచారు. "ఆగష్టు 1 నుంచి 3 వరకు, ఇండోనేషియాలోని, నార్త్ సులవేసిలో జరగబోయే మనాడొ డెప్త్ కాంపిటీషన్‌లో నెగ్గడం కోసం, శుభమ్ పాండేతో కలిసి ఇండోనేషియాలోని అమెడ్‌లో శిక్షణ తీసుకుంటున్నాను" అంటూ చెప్పుకొస్తున్నారు.



ఘంటసాలలో కొడాలి దేవచంద్రరావు భార్య భవానికి బీమా చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

ఘంటసాల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ అధిక ప్రాధాన్యమిస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ఘంటసాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొడాలి దేవ చంద్రరావు మార్చి 19న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాద బీమా చెక్కు రూ.5 లక్షలను దేవచంద్రరావు భార్య భవానికి బుధవారం ఘంటసాలలో కొనకళ్ల అందజేశారు. దేవచంద్రరావు పిల్లల చదువుకు ఎన్టీఆర్ ట్రస్ట్‌లో అవకాశం కల్పిస్తామన్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎస్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, నేతలు తుమ్మల చౌదరిబాబు, అయినపూడి భాను ప్రకాష్, బండి పరాత్పరరావు, గొర్రెపాటి వెంకటరామకృష్ణ, వేమూరి సాయి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై విషం చిమ్ముతున్న జగన్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారు

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్

మచిలీపట్నం టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అమరావతిపై విషం చిమ్ముతున్న జగన్ మీడియాకు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. బుధవారం తన కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో వ్యాస్ మాట్లాడారు. దేవతల రాజధాని అమరావతి అభివృద్ధిని చూడలేక విమర్శలకు దిగుతున్నారని అన్నారు. పంచారామాల్లో ఒకటైన అమరావతిని, మహిళలను తన మీడియాలో కించపరిచినందుకు జగన్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

బీచ్ ఫెస్టివల్‌లో సమర్థవంతంగా పనిచేశారు

● పోలీసు సిబ్బందికి ఎస్పీ గంగాధరరావు ప్రశంస

మచిలీపట్నం టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో జరిగిన బీచ్ ఫెస్టివల్‌లో నాలుగు రోజుల పాటు పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని ఎస్పీ గంగాధరరావు ప్రశంసించారు. ట్రాఫిక్ నియంత్రణలో సేవలందించిన ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావును అభినందిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మిడ్‌డే మీల్స్, హాస్టల్ విద్యార్థులకు
నాణ్యమైన బియ్యం అందిస్తున్నాం: జేసీ

మచిలీపట్నం టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సూపర్ ఫైన్ నాణ్యత గల 9647 సంచులను సరఫరా చేశామని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం నగరంలోని చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు 25 కిలోల సంచుల బియ్యాన్ని స్కూల్ హెచ్ఎం జీ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలకు 6,855, సంక్షేమ వసతి గృహాలకు 2,792 సంచుల బియ్యం పంపించామన్నారు. ప్రతి సంచిపైన క్యూ ఆర్ కోడ్‌తో పాటు రైతు పేరు, పీపీసీ కేంద్రం, బియ్యం రకం, రైసుమిల్లు, స్టోరేజ్ గిడ్డంగి, ధ్రువీకరించిన సాంకేతిక వ్యక్తి పేరు, మొదటి ప్యాకింగ్ ఏజెన్సీ వివరాలు ముద్రించి ఉంటాయన్నారు. ఏ మాత్రం అవకతవకలు లేకుండా సక్రమంగా పంపిణీ అయ్యేందుకు పారదర్శకంగా ఏర్పాటు చేశామన్నారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జీ శిరీష, ఎంఈవో గురుప్రసాద్, స్కూల్ హెచ్ఎం గురుమూర్తి పాల్గొన్నారు.



సూపర్‌ఫైన్ బియ్యం సరఫరా ప్రారంభిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

పెడన కమిషనర్‌గా ఎల్.చంద్రశేఖరరెడ్డి

పెడన, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్‌గా ఎల్.చంద్రశేఖరరెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. చంద్రశేఖరరెడ్డికి మునిసిపల్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారిని కమిషనర్‌ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖరరెడ్డి

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా రామారావు

పెడన మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా రామారావు నియమితులయ్యారు. ఆముదాలవలస మునిసిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను బదిలీ చేస్తూ పురపరిపాలన శాఖ డైరెక్టర్ పి.సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో ఎనిమిది మంది యువకుల అరెస్టు

పెడన, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనలో 8 మంది యువకులను అరెస్టు చేసినట్లు పెడన ఎస్సై జి.సత్యనారాయణ తెలిపారు. గుడ్లవల్లేరు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజులపాటి వీరబాబు ఈనెల 8న తన బంధువులతో కలసి ట్రాక్టర్‌పై మచిలీపట్నం బీచ్ రోడ్డులోని వాకాలమ్మ సంబరానికి వెళ్లి తిరిగి వస్తుండగా పెడన-బంటుమిల్లి రోడ్డులోని చూజీ కంపెనీ వద్ద కోడూరు భార్గవ్, చిన్నం వెంకన్నబాబు, వర్ల కిరణ్, ఆలమూరి శివనాగకుమార్, బొర్రా ప్రవీణ్, చిన్నం రాహుల్, జంగం రాహుల్, కోడూరు నిఖిల్‌లు ట్రాక్టర్‌ను ఆపి గొడవకు దిగారు. అనంతరం కానిస్టేబుల్ వీరబాబు, అతని బావమరిది నాగరాజుపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి కోడూరు భార్గవ్, చిన్నం వెంకన్నబాబు, బొర్రా కిరణ్, ఆలమూరి శివనాగకుమార్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. బొర్రా ప్రవీణ్, చిన్నం రాహుల్, జంగం రాహుల్, కోడూరు నిఖిల్‌ను బుధవారం అరెస్టు చేశారు. గురువారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

నిజాయితీగా పనిచేసినా గుర్తింపేదీ?

● నందిగం సర్పంచ్ బొడ్డు చినబాబు ఆవేదన

పెడన రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): టీడీపీలో నిజాయితీగా పనిచేసిన వారికి తగిన గుర్తింపు లేదని నందిగం సర్పంచ్ బొడ్డు చినబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల నాయకులు పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వటంలేదని, స్థానిక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లినా తగిన పరిష్కారం దొరకడం లేదని తెలిపారు. నియోజకవర్గంలో తనలాంటి వారు అనేక మంది ఉన్నారని, పార్టీకోసం పనిచేసేవారిని దూరం చేసుకోవద్దని ఆయన సూచించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, నియోజకవర్గ నాయకులు సమస్యను సరిదిద్దాలని కోరారు.

బదిలీల కౌన్సెలింగ్‌కు ఇద్దరు డీఈవోలు

● జడ్పీ సమావేశపు హాలు, డీఈవో కార్యాలయం సమావేశపు హాలులో కౌన్సెలింగ్
● 926 మంది ఎస్జీటీలకు బదిలీల కౌన్సెలింగ్ ● మాన్యువల్ కౌన్సెలింగ్‌పై టీచర్ల హర్షం

మచిలీపట్నం టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండో రోజున బుధవారం సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ ఇద్దరు డీఈవోలు నిర్వహించారు. మొదటి రోజున కేవలం 200 మందికే రాత్రి 2 గంటలు పట్టింది. దీంతో ఈ సమస్యను అధిగమించేందుకు కృష్ణాజిల్లా డీఈవో రామారావుతోపాటు ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు కౌన్సెలింగ్ చేపట్టారు. ఈ కౌన్సెలింగ్ ఉమ్మడి కృష్ణాజిల్లాను దృష్టిలో ఉంచుకుని చేపట్టారు. కృష్ణాజిల్లా డీఈవో జీవీజీ రామారావు డీఈవో కార్యాలయం సమావేశపు హాలులో 430 మంది సెకండరీ గ్రేడు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అందులో 136 మంది ఉర్దూ టీచర్లకు, 294 మంది సెకండరీ గ్రేడ్ (తెలుగు) టీచర్లకు కౌన్సెలింగ్ చేపట్టారు. అలాగే జడ్పీ సమావేశపు హాలులో ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ రామారావు కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలను హాలులోకి అనుమతించారు. బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ఎస్జీటీలకు కావల్సిన స్థానాలు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు.



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కృష్ణా డీఈవో రామారావు, హాజరైన సెకండరీ గ్రేడు టీచర్లు

పారదర్శకంగా కౌన్సెలింగ్

సెకండరీ గ్రేడ్ టీచర్ల మాన్యువల్ కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర పరిశీలకుడు, అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరుగుతున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను ఆయన పర్యవేక్షించారు. కౌన్సెలింగ్‌లో పాయింట్ల విషయంలో ఉపాధ్యాయులు ఎవరైనీ అవకతవకలకు పాల్పడినట్టు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఏసీలు సరిగా పనిచేయడం లేదని కొందరు ఉపాధ్యాయులు అడిషనల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీఈవోలు పీవీజే రామారావు, యూవీ సుబ్బారావుతో పాటు 15 సంఘాల నేతలు పాల్గొన్నారు. కాగా జిల్లా పరిషత్ కార్యాలయం రోడ్డు, ముందర పెద్ద ఎత్తున టీచర్లు వచ్చిన కార్లను చూసి సుబ్బారెడ్డి ఆశ్చర్యపోయారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఆక్వా పరిశ్రమను గాడిలో పెడతాం

● డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

పెనమలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ విధానాలు, ఇటీవల అమెరికా విధించిన పరస్పర సుంకాల కారణంగా సంక్షోభానికి గురైన ఆక్వా పరిశ్రమను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. బుధవారం పెనమలూరు చేపల కుండీల వద్ద ఉన్న ఫిషరీస్ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఏపీ ఆక్వాకల్చర్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణ, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 9న టీడీపీ కూటమి ప్రభుత్వం అమెరికా విధించిన సుంకాలతో సహా ఆక్వా కల్చర్ రంగం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను అధ్యయనం చేయడానికి, పర్యవేక్షించడానికి ఆక్వాకల్చర్ కమిటీని నియమించామన్నారు. ఆక్వా రంగ స్థిరత్వం కోసం స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక వ్యూహాలను చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసిందన్నారు. దీనికోసం 18 కన్సల్టేషన్ సమావేశాలు భౌతికంగా, వర్చువల్ రీతిలో జరిగాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రొయ్యల మేతల ధరలను కిలో రూ.4కు తగ్గించిందన్నారు. రాష్ట్రంలోని మొత్తం 2.07 లక్షల ఆక్వా కల్చర్ చెరువులు, 3800 వ్యాపార యూనిట్ల జియోట్యాగింగ్‌ను మత్స్యశాఖ పూర్తి చేసిందన్నారు. ఏపీఐబీసీ చైర్మన్, ఫిషరీస్ శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, అడిషనల్ కమిషనర్ అంగేలి, ఆక్వా జేడీ లాల్ అహ్మద్ పాల్గొన్నారు.



అక్టోబరు 15వ తేదీ వరకు ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి

(3వ పేజీ తరువాయి)

అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట రేవుల వద్ద గస్తీని పెంచాలన్నారు. ఆర్డీవో, డీఎస్పీ స్థాయి అధికారులు తరచూ ఇసుక రీచ్‌లను తనిఖీ చేయాలని సూచించారు. 3 షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి ఇసుక అక్రమ రవాణా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని శ్రీకాకుళం, నార్త్‌వల్లూరు, రొయ్యూరు, మద్దూరు, చోడవరం, పటమటలంక స్టాక్ యార్డుల్లో 7.50 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇక్కడి నుంచే ఇసుకను ప్రజలు కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఏఎస్పీ సత్యనారాయణ, గనులశాఖ డీడీ శ్రీనివాసకుమార్, భూగర్భ జలశాఖ డీడీ విజయవర్ధన్, నీటిపారుదలశాఖ ఈఈ రవికిరణ్, గనుల శాఖ ఏడీ కొండారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్ పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

(3వ పేజీ తరువాయి)

పెనమలూరులో 61.6, కంకిపాడులో 61.4, పమిడిముక్కలలో 58.2, నాగాయలంకలో 58.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెడనలో 57.7, మచిలీపట్నం సౌత్‌లో 54.2, చల్లపల్లిలో 53.8, బంటుమిల్లిలో 52.6, తోట్లవల్లూరులో 50.4, ఘంటసాలలో 48.6, అవనిగడ్డలో 45.4, మోపిదేవిలో 39.6, కోడూరులో 38.4, పామర్రులో 37.4, బాపులపాడులో 32.8, గన్నవరంలో 29.2, గూడూరులో 27.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. గురువారం కోస్తాతీరం వెంబడి ఒక మోస్తరు వర్షం కురుస్తుందని, తీరం వెంబడి పలు ప్రాంతాల్లో ఈ నెల 15వ తేదీ వరకు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

(3వ పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలన సందర్భంగా గురువారం పోరంకి మురళీరిసార్ట్సులో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. సదరు సభ ఏర్పాట్లను బుధవారం మీనా పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాకపోకలు, భద్రతకు ఎలాంటి అంతరాయం కలుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్లానింగ్ ఫైనాన్స్ కార్యదర్శి అనంతశంకర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్లు గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు పాల్గొన్నారు.

సాగుపై సందిగ్ధం!

(3వ పేజీ తరువాయి)

దిగువకు పోదని, పొలాలు నారుమడుల దశలో, పైరు దశలో మునిగిపోతాయని ఆందోళన చెందుతున్నారు. మచిలీపట్నం మండలంలోని శివగంగ, తాళ్లపాలెం, లంకపల్లి డ్రెయినేజీల్లో గుర్రపు డెక్క పేరుకుపోయింది. అయినా ఈ డ్రెయినేజీల్లో ఓఅండ్ఎం పనులను నేటికీ ప్రారంభించలేదు. కంకిపాడు వద్ద బందరు కాలువ లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటికి కనీస మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు. వీటితో పాటు ప్రధాన కాలువలకు సంబంధించి రెగ్యులేటర్‌లు, లాకులు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బందరు కాలువలో పెరిగిన గుర్రపు డెక్క

యనమలకుదురు లాకుల వద్ద ప్రారంభమై మచిలీపట్నంలోని గిలకలదిండి వరకు 76 కిలోమీటర్ల మేర ప్రవహించి 1.25 లక్షల ఎకరాలకు సాగునీరందించే బందరు కాలువ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కాలువలోని పలు ప్రాంతాల్లో గుర్రపు డెక్క, నాచు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. మచిలీపట్నం మండలం మల్లవోలు లాకుల దిగువన సీతారామపురం వద్ద బందరు కాలువలో గుర్రపు డెక్క పెరిగి చుక్కనీరు దిగువకు వెళ్లడంలేదు. గుర్రపు డెక్కను తొలగించాలని నీటిపారుదలశాఖ అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. అయినా నేటివరకు ఈ పనులను ప్రారంభించలేదు. బందరు కాలువ స్థితి ఇలా ఉంటే ఈ ఏడాది పొలాలకు సాగునీరు అందడం కష్టమవుతుందని రైతులు అంటున్నారు. దివిసీమ ప్రాంతంలోని గుండేరు, చిల్లలవాగు తదితర డ్రెయినేజీల్లో ఇంతవరకు ఓఅండ్ఎం పనులను ప్రారంభించలేదు. వేసవిలోనే గుర్రపు డెక్క, తూడు, నాచులను తొలగించేందుకు రసాయనాలను పిచికారీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఈ తరహా పనులు చేయకపోవడం గమనార్హం. పూర్తిస్థాయిలో వర్షాలు కురిసిన తర్వాత పనులు ప్రారంభిస్తే ఉపయోగం ఉండదని ఘంటసాల మండల రైతులు అంటున్నారు.

సబ్సిడీ విత్తనాల ఊసేది?

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.62 లక్షల హెక్టార్లలో వరి సాగు జరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా. చెరకు 3,549, మినుము 1,340, వేరుశెనగ 724, పత్తి 298, వివిధ రకాల పంటలు 133 హెక్టార్లలో సాగు చేయనున్నారు. ఈ ఏడాది 11,600 క్వింటాళ్ల వరి విత్తనాలను క్వింటాలుకు రూ.500 సబ్సిడీగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 6,200 క్వింటాళ్ల విత్తనాలను ఆయా మండలాల్లోని వ్యవసాయశాఖ కార్యాలయాలకు పంపామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సబ్సిడీపై ఇచ్చే వరి విత్తనాలు ఇంకా అందుబాటులోకి రాలేదని రైతులు అంటున్నారు. కంకిపాడు, గన్నవరం, తోట్లవల్లూరు, ఉయ్యూరు. పామర్రు, చల్లపల్లి, మొవ్వ తదితర మండలాల్లో బోరునీటి ఆధారంగా ఇప్పటికే 250 ఎకరాల్లో నారుమడులు పోశారు. కాలువలకు సాగునీటిని విడుదల చేస్తే గుడ్లవల్లేరు, పెడన, బంటుమిల్లి, గుడివాడ, గూడూరు, మచిలీపట్నం తదితర మండలాల్లో వెదజల్లే పద్ధతిన వరినాట్లు వేసేందుకు, నారుమడులు పోసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం మండలంలోని కేసరపల్లి-సావరగూడెం గ్రామల మధ్య రూ.40 లక్షల అంచనాతో నూతనంగా నిర్మించనున్న రిటైనింగ్‌వాల్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.96లక్షల వ్యయంతో అల్లాపురం గ్రామం నుంచి పాలిటెక్నిక్ కాలేజ్ మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు దావాజీగూడెం గ్రామ పరిధిలో నిర్మించిన ఎస్‌టీటీఎఫ్ కాలేజీ రోడ్లకు ఆయన ప్రారంభోత్సవ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ గతేడాది వరదలు వచ్చినప్పుడు రిటైనింగ్ వాల్ లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ఈ వాల్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. గ్రామాల్లోని చెరువులు గ్రామ ప్రజల ఉమ్మడి ఆస్తి అని, పూడికతీత ద్వారా వచ్చిన మట్టి ఆ గ్రామ ప్రజల అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. చెరువుల్లో తవ్వకాలు నిర్వహించేవారు మీటరు కంటే ఎక్కువ లోతు తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని, లారీల్లో మట్టిని తరలింపునకు అనుమతి లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇప్పటివరకు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మట్టి అక్రమ తవ్వకాల ఆరోపణలపై స్పందిస్తూ ఆధారాలుంటే సమర్పించాలని తప్పకుండా కఠిన చర్యలు చేపడతామన్నారు. చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, గూడపాటి తులసీమోహన్, బోడపాటి రవికుమార్, మేడేపల్లి రమ, కాసర్నేని రంగబాబు, బీజేపీ నేతలు కుమారస్వామి, కానూరు శేషమాధవి, అధికారులు పాల్గొన్నారు.



రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఘంటసాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. దేవరకోట గ్రామంలో రైతు వేమూరి రత్నగిరిరావు పొలం వద్ద బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఎడ్లకు, నాగలికి ప్రత్యేక పూజలు చేసి నాగలి చేతపట్టి సంప్రదాయ పద్ధతిలో దుక్కి దున్ని విత్తనాలు చల్లి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో పాల్గొని ప్రసంగించారు. సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, జనసేన నేతలు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో
'దివి' సమగ్రాభివృద్ధి



అవనిగడ్డ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కుంటుపడిన నియోజకవర్గ అభివృద్ధి కూటమి ప్రభుత్వం వచ్చాయక పరుగులు పెడుతోందని తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరించడంతో పాటు పంట కాలువల్లో తూటుకాడ తొలగింపు పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఎదురుమొండి - ఏటిమొగ బ్రిడ్జి పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయని, రూ.109 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. అవనిగడ్డ - కోడూరు రహదారి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో నేడు పూర్తయిందని, త్వరలోనే ఘంటసాల, కొడాలి రహదారుల నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల కృషి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో అవనిగడ్డ నియోజకవర్గం రాబోయే నాలుగేళ్లలో అభివృద్ధి సాధించదగలదని గోవర్ధన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇదేం పద్ధతి?

(3వ పేజీ తరువాయి)

పంపుతుంటారు. ఇలా వచ్చిన వారికి ప్రొటోకాల్ విభాగంలో సిబ్బంది ఒక సహాయకుడిని ఇచ్చి దర్శనానికి పంపుతుంటారు. ఈ సిఫార్సు దర్శనాలు ఎక్కువ కావడంతో దుర్గగుడి అధికారులు కొన్నాళ్ల క్రితం ఒక నిర్ణయం తీసుకున్నారు. ఎంతమంది దర్శనానికి వస్తే అందులో సగం మందితో టికెట్లు కొనిపించాలని నిర్ణయించారు. ఒక సిఫార్సు లేఖపై నలుగురు వస్తే వారిలో ఇద్దరితో టికెట్లు కొనుగోలు చేయించి మిగిలిన ఇద్దరిని ఉచితంగా దర్శనానికి పంపుతున్నారు. ఇలా చేయడంతో దర్శనానికి వచ్చిన వారు ప్రొటోకాల్ ఆఫీస్ దగ్గర నుంచే సిఫార్సు చేసిన వారికి ఫోన్ చేసి టికెట్లు తీసుకోమంటున్నారని చెబుతున్నారు. సిఫార్సు చేసిన వారు సహాయకులపై చిందులు తొక్కడంతో సిబ్బంది చేసేదిలేక ఉచితంగానే అంతరాలయం దర్శనాలకు పంపుతున్నారు. ఇప్పుడు ఏకంగా సిఫార్సు లేఖలు ఇస్తున్న వారే భక్తులతో టికెట్లు కొనుగోలు చేయించవద్దని ఒక నోట్ పెడుతున్నారు. దేవస్థాన వర్గాల్లో ఇదిప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అంతరాలయం తప్ప మరో దర్శనం వద్దు

ప్రజాప్రతినిధులు, అధికారుల పేషీల సిఫార్సులతో వచ్చిన భక్తులు అంతరాలయం దర్శనానికి తప్ప మరో దర్శనం చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల సిఫారసుతో వచ్చినందున తమకు ప్రొటోకాల్ వర్తిస్తుందన్న భావనలో భక్తులు ఉంటున్నారు. దుర్గగుడికి ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ మూడు వారాల్లో రోజుకు 30 వేల నుంచి 40వేల మంది అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ఆలయంలో ఉచిత దర్శనం, రూ.100, రూ.300, రూ.500 దర్శనాలు ఉన్నాయి. ఇందులో రూ.500 టికెట్ తీసుకున్న భక్తులను అంతరాలయంలోకి అనుమతిస్తారు. రూ.300 టికెట్ ఉన్న భక్తులకు ముఖ మండప దర్శనం చేయిస్తారు. ఆలయంలో ఒక్కోసారి రూ.500 క్యూ రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో సిఫార్సులతో వచ్చిన వారిని రూ.300 క్యూలో పంపాలని ప్రొటోకాల్ సిబ్బంది భావిస్తుంటారు. అంతరాలయం క్యూ రద్దీగా ఉన్నందున ముఖ మండప దర్శనానికి వెళ్లాలని సిబ్బంది భక్తులకు సూచిస్తుంటారు. దీనికి వారు ససేమిరా అంటున్నారు. దీనితో వారిని ప్రముఖులను తీసుకువెళ్లే మార్గంలో దర్శనానికి పంపాల్సిన పరిస్థితి వస్తుంది. దీనిపై అప్పటి వరకు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడిన భక్తులు మండిపడుతున్నారు. ఈ భక్తులకు అంతరాలయం చేయించకపోతే సిఫార్సు చేసినవారి నుంచి చివాట్లు పడతాయి అన్న భయంతో తప్పక అంతరాలయంలోకి పంపుతున్నారు. దీనివల్ల ఇతర భక్తుల నిరసనను తాము ఎదుర్కోవాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. టికెట్లు తీసుకోవడం వల్ల వచ్చే ఆదాయం అమ్మవారి హుండీకే చెందుతుంది తప్ప తమ జేబులోకి రాదని ఆలయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

పునర్నిర్మాణం..

(3వ పేజీ తరువాయి)

వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టింది. మొత్తం 75 ఎకరాల విస్తీర్ణంలోని ప్లాంట్‌ను సన్నద్ధం చేసింది. బస్సుల బాడీ బిల్డింగ్‌కు అనుగుణంగా తీర్చిదిద్దిన తర్వాత ఉత్పాదకతను ప్రారంభించాలని నిర్ణయించింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అశోక్ లేల్యాండ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా స్థానికంగా ఉన్న 600 మందికి ఉద్యోగాలు లభించాయి. మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో అతి పెద్ద భారీ పరిశ్రమగా అశోక్ లేల్యాండ్ ఉత్పత్తి సాగిస్తోంది. ఈ ప్లాంట్ మళ్లీ ప్రారంభం కావడానికి ఎమ్మెల్యే యార్లగడ్డ విశేషమైన కృషి జరిపారు.

విజయవాడ మెట్రో పరుగులు!

వైసీపీ ప్రభుత్వంలో తొక్కిపట్టిన విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం రాగానే కదలిక వచ్చింది. విజయవాడ మెట్రో ప్రాజెక్టును మొదటి దశలో గన్నవరం నుంచి రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు మొత్తంగా 38.4 కిలోమీటర్ల పొడవున రెండు కారిడార్లను నిర్మించటానికి అడుగులు పడ్డాయి. ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించటంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. కేంద్ర ప్రభుత్వం కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కోసం కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ దిశగా అడుగులు వేసింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా యంత్రాంగాల స్థాయిలో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ ఎన్‌పీ రామకృష్ణారెడ్డి ఇప్పటికే చర్చలు జరిపారు. భూ సేకరణ నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం చేస్తున్నారు. మెట్రో ప్రాజెక్టుకు నూరుశాతం నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. భాగస్వామ్య విధానంలో చేద్దామని కేంద్రం ప్రతిపాదించింది. దీంతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు ప్రస్తుతం రుణ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. దాదాపుగా టెండర్ల దశకు చేరుకుంటోంది.

నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ సాకారం

కూటమి ప్రభుత్వం రాగానే కేంద్రం విజయవాడకు అతిపెద్ద ఫ్లై ఓవర్‌ను మంజూరు చేస్తూ శుభవార్త వినిపించింది. రూ.600 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్-16 మీద ఆరు వరసల విధానంలో నిర్మించేందుకు డీపీఆర్ కూడా పూర్తయింది. టెండర్లు పిలిచే దశలో.. ఇదే మార్గంలో మెట్రో కారిడార్ కూడా వస్తుండటంతో ఈ సమస్యను ఎలా అధిగమించాలన్న దానిపై ఎన్‌హెచ్, ఏపీఎంఆర్‌సీలు భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ మీద మెట్రో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేలా.. నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు 4.5 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు అడుగులు పడ్డాయి. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు సంబంధించి మెట్రో అధికారులు రూ.1000 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు వేసి మోర్తుకు పంపించారు. ఆమోదం రాగానే.. దీని పనులు మెట్రో కారిడార్-1లో భాగంగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులే చేపడతారు.

జెట్ సిటీకి పునర్వైభవం దిశగా అడుగులు

జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పని, నివాసం ఒకేచోట అన్న విధానంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 15 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 6,755 ఇళ్ల నిర్మాణ పనులతో పాటు, ఫ్యాక్టరీ ఫ్లాటెడ్ కాంప్లెక్స్-1 పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక జెట్ సిటీకి పునర్వైభవం దిశగా అడుగులు పడ్డాయి. ఫ్యాక్టరీ ఫ్లాటెడ్ కాంప్లెక్స్‌ను పూర్తి చేయటానికి అపెడ్కో, ఏపీఐఐసీలకు సంయుక్తంగా బాధ్యతలను అప్పగించింది.

ఎన్‌డీబీ రోడ్లకు శ్రీకారం

వైసీపీ ప్రభుత్వ హయాంలో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) నిధులతో తలపెట్టి అర్ధంతరంగా వదిలేసిన ఆర్అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం రాగానే చర్యలు చేపట్టింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలో మొత్తం 13 ఆర్అండ్‌బీ రోడ్లను రెండు వరసలుగా విస్తరించేందుకు రూ.245 కోట్ల వ్యయంతో శ్రీకారం చుట్టగా, కేవలం మూడా రోడ్లనే అప్పట్లో చేపట్టడం జరిగింది. మిగిలిన 10 రోడ్ల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. కూటమి ప్రభుత్వం రాగానే.. ఎన్‌డీబీ పనులపై దృష్టి సారించటంతో ఉమ్మడి జిల్లాలో 10 ఆర్అండ్‌బీ రోడ్ల పనులను ప్రారంభించారు. కాంట్రాక్టు సంస్థతో క్షేత్ర స్థాయిలో పనులు చేయిస్తోంది.

విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే

విజయవాడ - నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ - ఖమ్మం మధ్య తలపెట్టనున్న నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మూడేళ్ల ఎదురు చూపులు ఫలించాయి. కూటమి ప్రభుత్వం రాగానే భూ సేకరణ అంశంపై దృష్టి సారించటంతో 86శాతంపైగా భూములను అప్పగించటం జరిగింది. ఎన్‌హెచ్‌కు స్వాధీనం చేసిన భూముల్లో పనులు మొదలయ్యాయి.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

పంటల్లో యాజమాన్య చర్యలతో నాణ్యమైన దిగుబడులు

మోపిదేవి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో తగిన యాజమాన్య చర్యలు చేపట్టడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, డాక్టర్ బి.కల్యాణ్ బాబు తెలిపారు. ఉత్తర చిరువోలులంక గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పంటల్లో ఎరువులు, కలుపు యాజమాన్యంపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తేనే ప్రయోజనకరమని సూచించారు. సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, ఏవో హెప్సిబారాణి ఉన్నారు.



సుల్తానగరం-ముక్కొల్లు రోడ్డుకు శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా కూటమి పాలన

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన/పెడన రూరల్/గూడూరు/బంటుమిల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం పెడన నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అమరావతిని వేశ్యల రాజధాని అంటూ జగన్ మీడియాలో చేసిన వ్యాఖ్యల పట్ల కృష్ణప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పెడనలో...

1వ వార్డులో రూ.8 లక్షల 80వేల ప్రభుత్వ గ్రాంటుతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, 14వ వార్డులోని ఎన్టీఆర్ పార్కులో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.5 లక్షల 16వేలతో ఏర్పాటు చేయనున్న ప్లాట్‌ఫాం, సిమెంటు బెంచీలు, వాటర్ ఫౌంటేన్, సీసీ కెమెరాలు తదితర పనులకు కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. భట్టజ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కెమిస్ట్రీ ల్యాబ్‌ను, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు.

పెడన మండలంలో..

కాళీకృష్ణ గుడి నుంచి- పాత బల్లిపర్రు వెళ్లే మార్గం, శింగరాయపాలెంలోని హనుమాన్ కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు.

గూడూరు మండలంలో..

సుల్తానగరం నుంచి ముక్కొల్లు వరకు రూ.3 కోట్లతో నిర్మించనున్న ఆర్ అండ్ బీ రోడ్డుకు శారదాయిపేటలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఆకులమన్నాడులో రూ.28 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

బంటుమిల్లి మండలంలో..

ముంజులూరులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. సాతులూరు నుంచి కొర్లపాడు వరకు రూ.9 లక్షల డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు.

మచిలీపట్నంలో భారీ వర్షం

● నీటమునిగిన రోడ్లు

మచిలీపట్నం టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. రోడ్లు నీట మునిగాయి. డ్రెయిన్లు పూడికతీయిస్తున్నందున రోడ్లపై నీరు సాయంత్రానికి ఇంకిపోయింది. నాలుగు రోజులుగా ఎండవేడికి అల్లాడిన ప్రజలకు వర్షంతో ఊరట కలిగింది.

నాగాయలంక మండలంలో

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు

నాగాయలంక: మండలంలో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో భారీవర్షం కురిసింది. పిడుగుపాటుకు భావదేవరపల్లిలో పొలంలో ఉన్న విద్యుత్ స్తంభాల లైన్ కనెక్షన్లు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉదయం విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు. రెండు గంటలపాటు వర్షం కురిసింది.



మచిలీపట్నం కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద రోడ్డుపై నీరు

అగస్త్రేశ్వరస్వామి ఆలయ గాలి గోపురంపై పిడుగు

పెడన: పట్టణంలోని గంగా పార్వతీ సమేత అగస్త్రేశ్వరస్వామి ఆలయ గాలి గోపురంపై బుధవారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో పిడుగు పడింది. పిడుగుపాటుకు గాలిగోపురం పాక్షికంగా ధ్వంసమైంది. గాలిగోపురంపై ఉన్న సింహం విగ్రహంతో పాటు ఇతర విగ్రహాలు కూడా ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో కొన్ని పావురాలు, గబ్బిలాలు కూడా చనిపోయాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బళ్ల ప్రసాద్ దెబ్బతిన్న గాలి గోపురాన్ని పరిశీలించారు.



పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న గాలిగోపురం

అమరావతిపై విషం చిమ్ముతున్న జగన్

● టీటీడీ ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు ఏవీ రమణ ఆగ్రహం



టీటీడీ మాజీ సభ్యుడు ఏవీ రమణను సత్కరిస్తున్న గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డి ఐదేళ్ల విధ్వంస పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడింది. ఆయనకు ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ అమరావతి రాజధానిపై ఇంకా విషం చిమ్ముతూనే ఉన్నారు. కొత్త పరిశ్రమలు రాకుండా పేటీఎం బ్యాచ్‌తో రాష్ట్రాభివృద్ధికి అడ్డు తగులుతున్నారు. జగన్ పత్రిక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా రాతలు రాస్తోంది.' అని టీటీడీ ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ రాష్ట్ర కార్యాలయం సెక్రటరీ ఏవీ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం శివిండి అగ్రహారంలో టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తోందన్నారు. టీడీపీని బలోపేతం చేసేందుకు మంత్రి నారా లోకేశ్ చేపడుతున్న కార్యక్రమాలకు మంచి స్పందన వస్తోందన్నారు. ప్రజలు చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. ఏవీ రమణను టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ గొర్రెపాటి శ్రీనివాస్‌చంద్, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు.



అరిసేపల్లిలో ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

శాస్త్రోక్తంగా ఏరువాక పౌర్ణమి

●భూమిపూజ చేసి విత్తనాలు చల్లిన రైతులు

మచిలీపట్నం టౌన్/చల్లపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమిని బుధవారం బందరు మండలం అరిసేపల్లి, చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భూమిపూజ చేసి రైతులు విత్తనాలు చల్లారు. అరిసేపల్లిలో డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, బందరు రూరల్ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ మనోహర్, ఏవో హారిక పాల్గొన్నారు. అనంతరం కౌలు రైతులకు కార్డులు అందజేశారు. చింతలమడలో లక్ష్మీపురానికి చెందిన పురోహితుడు సుద్దపల్లి సుందరరామయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పురోహితులు సుద్దపల్లి శ్రీనివాసరావు, రామసుందర సత్యగురునాథ్‌లు వ్యవసాయభూమిలో తోటి రైతులతో కలిసి భూమిపూజ చేశారు. ఎద్దులకు, నాగలికి పూజలు చేసి నాగలి దున్నారు. ట్రాక్టర్‌తో దుక్కులు దున్ని విత్తనాలు చల్లారు. ఖరీఫ్‌సాగు సజావుగా సాగి మంచి దిగుబడులు సాధించి రైతు చల్లగా ఉండేలా ఆశీర్వదించాలని భూమితల్లికి పూజలుచేసి హారతులిచ్చారు. రైతులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉల్లిపాలెం - వేణుగోపాలపురం రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విధ్వంసం నుంచి వికాసం వైపు కూటమి పాలన

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ విధ్వంసకర పాలన నుంచి అన్ని రంగాలను వికాసం వైపు కూటమి ప్రభుత్వం నడిపిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవి పంచాయతీ శివారు మోపిదేవి వార్పు వద్ద స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్స్, ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ ఫండ్స్ రూ.8.83 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. రూ.1.13 కోట్లు నిధులతో పులిగడ్డ ఆక్విడెక్ట్ మరమ్మతులు చేయించి, పూర్వవైభవం తెస్తామని తెలిపారు. కృష్ణా సముద్రపు కరకట్టల పటిష్టతకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని, త్వరగా వాటికి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. రూ.5.63 కోట్లతో అవనిగడ్డలోని దివి సౌత్ చానల్ రక్షణ గోడ నిర్మించి కాలువ గట్లు బలోపేతం, పులిగడ్డ ఆక్విడెక్ట్ సమగ్ర అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని కాలువలకు 42 షట్టర్లు ఏర్పాటు చేశామన్నారు. గుండేరు, లింగన్నకోడు, రత్నకోడు డ్రెయిన్లలో కిక్కిస పూడిక తొలగింపు చేపట్టినట్లు తెలిపారు. రూ.3 కోట్ల 20 లక్షలతో ఓ అండ్ ఎం నిధుల్లో భాగంగా ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల పరిధిలోని కేఈబీ కెనాల్ ప్రధాన, బ్రాంచ్ కాలువల్లో తూటుకాడ, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టామన్నారు. సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి నివాళులర్పించారు.

కె.కొత్తపాలెంలో సిమెంట్ రోడ్ల ప్రారంభం

పల్లె పండుగలో భాగంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని వరద ప్రభావిత గ్రామమైన కె.కొత్తపాలెం దళితవాడలో నిర్మించిన నూరు శాతం సిమెంట్ రహదారులను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. కె.కొత్తపాలెం దళితవాడలో రూ.1.24 కోట్ల నిధులతో 15 సిమెంట్ రోడ్లను నిర్మించామన్నారు.

రూ.2 కోట్ల 80 లక్షలతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

కోడూరు: ఉల్లిపాలెంలో పంచాయతీ రాజ్ శాఖ(ప్రాజెక్ట్) ఆధ్వర్యంలో లింగన్నకోడు మేజర్ డ్రెయినేజీపై పీఎంజీఎస్‌వై నిధులు రూ.2 కోట్ల 80 లక్షలతో నూతన వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శంకుస్థాపన చేశారు. పీఎంజీఎస్‌వై-3 నిధులు రూ.3 కోట్ల 70 లక్షలతో ఉల్లిపాలెం - సాలెంపాలెం వయా వేణుగోపాలపురం మధ్య నూతనంగా నిర్మించి 4.1 కిలోమీటర్ల ప్రధాన రహదారిని ప్రారంభించారు. కోడూరులో పల్లెపండుగలో ఉపాధి నిధులు రూ.98.70లక్షలతో 1,563 మీటర్ల మేర నిర్మించిన పది సీసీరోడ్లను ప్రారంభించారు.

పీహెచ్‌సీ ప్రారంభం

ఘంటసాల: కేంద్ర ప్రభుత్వ జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.50 లక్షలతో ఘంటసాలపాలెం పీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యేను సర్పంచ్ దోనె రజని సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, ఏఎంసీ ఛైర్మన్లు తోట కనకదుర్గ, కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అవనిగడ్డ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. అవనిగడ్డ-కోడూరు రహదారిలో లక్ష్మీ టాకీస్ సమీపంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న చాట్రగడ్డ సువార్త(42) దానిపై నుంచి కిందపడిపోగా, అదే సమయంలో అటుగా వెళ్తున్న లారీ ఆమె మీదకు ఎక్కింది. దీంతో సువార్త అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలిది నాగాయలంక మండల పరిధిలోని పర్రచివర శివారు బిల్లిగ్రాం నగర్ అని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కోడూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందిన ఘటన కోడూరులో బుధవారం జరిగింది. ఉదయం నుంచి వర్షం కురుస్తున్న కారణంగా కోడూరులోని శ్రీ దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరం ముందున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి ఆవు మృతి చెందిందని గ్రామస్థులు చెబుతున్నారు. వర్షం కురిసేటప్పుడు విద్యుత్ స్తంభాలను తాకొద్దని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పంచాయతీ సిబ్బంది ఆవును ఖననం చేశారు.

రావి సీతామహాలక్ష్మి కన్నుమూత



మోపిదేవి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రావివారిపాలెం గ్రామానికి చెందిన రావి వెంకటేశ్వరరావు(మైనర్) సతీమణి సీతామహాలక్ష్మి (87) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు కాగా, ఒకరు ఇటీవల మృతి చెందారు. మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, ప్రముఖులు పరుచూరి అంజయ్య తదితరులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు.



రంగనాయకస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

అంగరంగవైభవంగా రంగనాయకస్వామి కల్యాణోత్సవాలు

మచిలీపట్నం టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రంగనాయకస్వామి దేవాలయంలో కళ్యాణోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి స్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవా కార్యక్రమాలు జరిపారు.

రామలింగేశ్వరస్వామి దేవాలయంలో..

స్వామిని నంది వాహనంపై ఊరేగించారు. రామ్మోహనరావు నాట్య బృందం ఆధ్వర్యంలో దేవాలయంలో రామాంజనేయ యుద్ధం నాటకాన్ని ప్రదర్శించారు. రాముడిగా రామ్మోహనరావు, ఆంజనేయుడిగా రమణరావు తమ నటనతో ప్రేక్షకులను మైమరపించారు. ఈ నాటకానికి ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు హార్మోనియంపై సహకరించారు.

వైభవంగా పోలాశమ్మ నెల జాతర

అవనిగడ్డ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డలో పోలాశమ్మ అమ్మవారి నెల జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు నైవేద్యాలతో తరలివచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మోదుమూడిలో యాళ్లమ్మ నెల జాతర బుధవారం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బచ్చు రఘునాథ్‌తోపాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేకనూరులో మాదివాడ వారి ఇలవేల్పు అంకాలమ్మ నెల జాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ నిర్వాహకుడు మాదివాడ శ్రీనివాస పెరుమాళ్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550	

కొండాలమ్మకు ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈనెల 13వ తేదీ శుక్రవారం కొండాలమ్మ అమ్మవారికి లక్ష మల్లెల అర్చన నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, 8 గంటలకు లక్ష మల్లెల అర్చన నిర్వహిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలని ఆయన కోరారు.

సన్న బియ్యం పంపిణీ

నందివాడ: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 12వతేదీ నుంచి విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్నభోజనాన్ని అందించనున్నట్టు ఎంఈవో డేవిడ్ రత్నరాజు తెలిపారు.

గుడివాడ సమగ్రాభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గుడివాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. బుధవారం చౌటపల్లి, దొండపాడు, లింగవరం గ్రామాల్లో రూ.1.9 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. చౌటపల్లిలో 26 లక్షలతో ఆరు సీసీ రోడ్లు, దొండపాడులో 53 లక్షలతో 13 రోడ్లు, లింగవరంలో రూ.30లక్షలతో 8 సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఏ సమస్య ఉన్నా గుడివాడ ప్రజావేదికలో సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు అందించేందుకు అత్యంత ప్రాముఖ్యతనిస్తున్నట్టు తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు ఉమ్మడిగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే ఏపీ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, గుడివాడ పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ కొత్రగడ్డ రవికుమార్, వైస్ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, ఎంపీడీవో విష్ణు ప్రసాద్, పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సింగళ్ల శ్రీనివాసరావు, చౌటపల్లి సర్పంచ్ వెలగలేటి రమ్య, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో గుడ్లవల్లేరులో రూ.12.44 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం గుడ్లవల్లేరులో ఆయన ఆంధ్రజ్యోతితో ఏడాది కాలంలో మండలానికి ఆయన తెచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. గుడ్లవల్లేరులోని గ్రామాల్లో రూ. 7.61 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేశామన్నారు. రూ.42.89 లక్షలతో మండల పరిషత్ పాఠశాలల మెరక పనులు చేయించామన్నారు. పశువులకు తాగునీటి తొట్టెలు, బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.2.66 కోట్లు నిధులు కేటాయించామన్నారు. సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ. 18 లక్షలు, షాదీఖానా నిర్మాణం, మైక్రోఫిల్టర్ల నూతన నిర్మాణాలకు రూ.23 లక్షలు కేటాయించామన్నారు. మల్టీపర్పస్ హాలు నిర్మాణానికి రూ.32లక్షలు, 0.50 ఎంఎల్‌డి మైక్రోఫిల్టర్‌ల నిర్మాణం, ఫిల్టర్ బెడ్ క్లీనింగ్, ఫిల్టర్ మీడియా పురుద్ధీకరించడం వంటి పనులకు రూ. 50 లక్షలు నిధులను సమకూర్చామన్నారు. రూ.2.20 కోట్లతో 33కేవీ నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే రాము వివరించారు.



దొండపాడులో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పెదమద్దాలిలో నూతనంగా ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.50.70లక్షలతో నిర్మించిన 13 సీసీ రోడ్లతో పాటుగా , పామర్రు గాంధీనగర్‌లో ఏడులక్షల వ్యయంతో నిర్మితమైన సీసీ రోడ్డును స్థానిక నేతలతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దివ్యమైన ఆశీస్సులతో ఏడాది కిందట రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాలు అమల్జేసిందన్నారు. ఎంపీడీవో కె.జ్యోతి, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, సీనియర్ టీడీపీ నేత శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ లాజరస్, జనసేన మండల కార్యదర్శి సింహాద్రి క్రాంతికుమార్, పంచాయతీరాజ్ ఏఈ పి.రామారావు పాల్గొన్నారు.

కూచిపూడి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. నాబార్డు నిధులు రూ.2.50 కోట్లతో కొండవరం నుంచి పెదముత్తేవి వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారికి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌అండ్‌బి డీఈ తాతా సంగీత, ఏఈ సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, కార్యదర్శి వీరంకి తులసీదాస్, పూర్ణచంద్రరావు, తాతా ప్రభాకర్‌రావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, మురారి నాగరాజు, మండవ రత్నగిరిరావు, మండవ కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

పమిడిముక్కల : వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. మంత్రివాడలో సుమారు రూ.26లక్షల అంచనాలతో నిర్మించిన సీసీరోడ్లు బుధవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిప్రభుత్వం వచ్చాక గ్రామాలలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, తాగునీటి సరఫరా పనులతో పాటు గ్రామాలకు వచ్చే రోడ్ల మరమ్మతుల పనులు ప్రారంభించిందన్నారు. సర్పంచ్ ఫ్రాన్సిస్, టీడీపీ నేత రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



పామర్రులో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



పామర్రులో విద్యుత్ అదాలత్ రేపు

పామర్రు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కర సాధన కోసం పామర్రులోని పాలశీతల కేంద్రం పంక్షన్ హాల్లో ఈనెల 13 విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు బందరు ఏపీఎస్‌పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.గోవింద రావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అదాలత్‌కు ముఖ్యఅతిథిగా సీజీఆర్ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవేన్స్ రెడ్రస్సల్ ఫోరం) చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ హాజరు కానున్నట్టు చెప్పారు. పామర్రు, పమిడిముక్కల, మొవ్వ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాత పూర్వకంగా అర్జీలు సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలని ఈఈ కోరారు. ఈ కార్యక్రమంలో పామర్రు డీఈఈ సుందర్‌రావు, పాల్గొన్నారు.

శివరామకృష్ణకు పలువురి నివాళి

పెదపారుపూడి : కొర్నిపాడులో చొక్కా శివరామకృష్ణ మృతి చెందాడు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోదరుడు వర్ల చైతన్య స్థానిక నాయకులతో కలసి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీకీ చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 8 మంది అరెస్టు

పెడన : కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనలో 8 మంది యువకులను అరెస్టు చేసినట్టు పెడన ఎస్సై జి. సత్యనారాయణ తెలిపారు. గుడ్లవల్లేరు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజులపాటి వీరబాబు ఈనెల 8న తన బంధువులతో కలసి ట్రాక్టర్‌పై మచిలీపట్నం మండలం బీచ్ రోడ్డులోని వాకాలమ్మ సంబరానికి వెళ్ళి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పెడన - బంటుమిల్లి రోడ్డులోని చూజీ కంపెనీ వద్ద కోడూరు భార్గవ్, చిన్నం వెంకన్నబాబు, వర్ల కిరణ్, ఆలమూరి శివనాగకుమార్, బొర్రా ప్రవీణ్, చిన్నం రాహుల్, జంగం రాహుల్, కోడూరు నిఖిల్‌లు ట్రాక్టర్‌ను ఆపి గొడవకు దిగారు. అనంతరం కానిస్టేబుల్ వీరబాబు, అతని బావమరిది నాగరాజులపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేశారు. అనంతరం కోడూరు భార్గవ్, చిన్నం వెంకన్నబాబు, బొర్రా కిరణ్, ఆలమూరి శివనాగకుమార్‌లను మంగళవారం రాత్రి అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. కాగా బొర్రా ప్రవీణ్, చిన్నం రాహుల్, జంగం రాహుల్, కోడూరు నిఖిల్‌లను బుధవారం అరెస్టు చేశారు. వీరిని గురువారం కోర్టులో హాజరుపస్తామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుడివాడ రూరల్ : ద్విచక్ర వాహనం మీద నుంచి జారి పడి ఒక మహిళ మృతి చెందిన సంఘటన జరిగినట్లు రూరల్ ఎస్సై చంటిబాబు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మే 31న మల్లాయిపాలెం రైల్వే గేటు సమీపంలో గుడివాడ సత్యనారాయణపురానికి చెందిన భార్యాభర్తలిరువురు రాత్రి 9.30 గంటలకు బైక్‌పై వస్తుండగా, బైక్ నుంచి ఆమె జారి కిందపడిపోయినట్టు తెలిపారు. నూకల రామవెంకట నాగరత్నం (50) భర్త శ్రీనివాసరావు బైక్ నడుపుతున్నప్పుడు జారి పడి తలకు బలమైన గాయాలయ్యాయన్నారు. ఆ రాత్రి బాధితురాలిని గుడివాడ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆస్పత్రికి తరలించారు.చికిత్స పొందుతూ ఆమె బ్రెయిన్ డెడ్ అయి బుధవారం మరణించినట్టు వైద్యులు తెలిపారన్నారు. ప్రభుత్వ చట్ట ప్రకారం ఆమె అవయవదానం చేశారన్నారు. రికార్డుల ప్రకారం పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

బడ్డీకొట్టులో నగదు చోరీ

తోట్లవల్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మెయిన్‌సెంటర్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు ఖాదర్ బడ్డీకొట్టు తాళాలు పగులకొట్టి రూ 10 వేలు నగదు, రూ. 20వేల విలువ గల సిగరెట్లు చోరీ చేశారు. ఈ చోరీపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఖాదర్ తెలిపారు. తాళాన్ని సమీపంలోని రాజస్థాన్ టీ స్టాల్ వద్ద దొంగలు పడేశారన్నారు. కొందరు యువకులు చోరీలకు అలవాటుపడినట్టుగా స్థానికులు చెబుతున్నారు. ఈ చిల్లర దొంగతనాలు ఇలా ఉంటే మరోవైపు కరెంటు తీగెలను కత్తిరించుకుపోయే దొంగతనాలు ఆగటం లేదు. పోలీసులు రాత్రి వేళల్లో గట్టి నిఘా ఏర్పాటుచేసి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బుడమేరు ముంపునకు శాశ్వత నివారణ చూపాలి

● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రకాష్‌బాబు

గుడివాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బుడమేరులోని ఆక్రమణలను తొలగించి, పూర్తిస్థాయిలో ఆధునికీకరణ చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బుడమేరు ముంపునకు గురైనప్పుడు నియోజకవర్గంలోని నందివాడ మండలంలోని అరిపిరాల, జనార్ధనపురం, ఓగిరాల, చినలింగాల గ్రామాల వద్ద బుడమేరు గట్టు బలహీనంగా ఉండటంతో గండ్లు పడ్డాయన్నారు. దీంతో వేలాది ఎకరాల్లో పంట, చేపలచెరువులు నీట మునిగాయన్నారు. ఆపరేషన్ బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టే నిరసనకు బుడమేరు పరివాహక ప్రాంతాల రైతులు, గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని 14వ తేదీన జరుగు నిరసన కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని గూడపాటి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, సభ్యులు డి.రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత ప్రకాష్‌బాబు

వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నేడు

గుడివాడ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ఈ నెల 12వ తేదీన చౌటపల్లి గ్రామంలో నిర్వహించనున్నామని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ బుధవారం తెలిపారు. కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్తలు, ఘంటసాల వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆర్థిక సాయం

పెదపారుపూడి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తమ్ములంపాడులో నిరుపేద కుటుంబానికి చెందిన జోగి సుమతి కుమారుడు జోగి శివ హర్ష చదువు నిమిత్తం టీడీపీ నాయకులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి సూచనల మేరకు దోసపాడు టీడీపీ అధ్యక్షుడు సజ్జా శివయ్య రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన శివయ్యకు సుమతి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

గుడివాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లకు విద్యుత్ స్మార్ట్‌మీటర్లను బిగించే కార్యక్రమాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి అధ్యక్షతన స్మార్ట్ మీటర్ల రద్దు విషయంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరళీకృత ఆర్థిక విధానాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రైవేటు కంపెనీలను ప్రజలను దోచుకునేందుకు అనుమతినిస్తున్నాయని ఆయనవిమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, అదానీ సంస్థలు కుమ్మక్కై రాష్ట్రాన్ని దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలకు పెనుభారంగా మారే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో పలు ప్రజాసంఘాల నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సురేష్, రేపాని కొండ, ఎస్.సమరం, లంకా సురేంద్ర, ఎ.వెంకటేశ్వరరావు, బసవలింగం, రామకృష్ణ పాల్గొన్నారు.

సీపీఎం నేత అరెస్టు

గుడివాడ : స్థానిక నైజాంపేటలో ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని అడ్డుకుని మీటర్లనును పగులకొట్టిన సీపీఎం నాయకుడు బి.వి.శ్రీనివాసరావును బుధవారం శ్రీకాళహస్తికాలనీలో ఇంటివద్ద టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా గృహ విద్యుత్ వినియోగదారుల ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని అడ్డుకున్న వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని సీపీఎం పట్టణకార్యదర్శి ఆర్‌సీపీరెడ్డి ఖండించారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

పెదపారుపూడి: నూతన తహసీల్దార్‌గా శ్రీను నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, రీ సర్వే డీటీ సుందరరావు, వీఆర్వోలు దానియేలు, రాజబాబు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కృష్ణా జిల్లా కోడూరు మండల తహసీల్దార్‌గా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పెదపారుపూడి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చినట్లు ఆర్ఐ తెలిపారు.

డ్రెయిన్లలో పూడిక తొలగింపు

గుడివాడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారుల్లోని డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించారు. వార్డులోని అంతర్గత డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో వర్షపునీరు రహదారులపైకి చేరింది. బుధవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి 14వవార్డులో డ్రెయిన్‌లలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన చెత్తను తొలగించారు. వర్షపునీటిని తొలగించేందుకు 11వవార్డులో ప్రొక్లయిన్ సహాయంతో కచ్చా డ్రెయిన్‌ను ఏర్పాటు చేశారు.



డ్రెయిన్లలో అడ్డుపడిన చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

వర్షంతో నారుమడులకు జీవం



కూచిపూడిలో జీవం పోసుకున్న నారుమడులు

కూచిపూడి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి విస్తారంగా కురిసిన వర్షం నారుమడులకు జీవం పోసినట్లైంది. మండలంలోని పలు గ్రామాల్లో బోర్ల కింద పలువురు రైతులు ఇప్పటికే నారుమడులు పోయగా, ఎండలు, వడగాల్పులతో నారుమడులు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఈ తరుణంలో కురిసిన వర్షంతో నారుమడులు ఊపిరి పీల్చుకున్నాయి. కూచిపూడి, కాకరంపాడు, పెదపూడి, మొవ్వ, బార్లపూడి, భట్లపెనుమర్రు, పెడసనగల్లు తదితర గ్రామాల రైతులు ఇప్పటికే నారుమడులు పోశారు. మరి కొన్ని ప్రాంతాల్లో ఈ వర్షం దుక్కులకు అనుకూలంగా మారటంతో ఖరీఫ్ సాగుకు అవసరమైన దుక్కిదున్నే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

కోలాట నృత్య ప్రదర్శన

తోట్లవల్లూరు : యాకమూరు కోదండ రామస్వామి దేవస్థానం వద్ద బుధవారం రాత్రి బృందావనమాలి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో కోలాట నృత్య ప్రదర్శన అట్టహాసంగా జరిగింది. గురువు అచ్చిరాజు శ్రీనివాసరాజు పర్యవేక్షణలో 40 మంది మహిళలు, చిన్నారులు కలిసి చేసిన కోలాట భజన వీక్షకులను రంజింప చేసింది. గ్రామంలోని భక్తులు, ప్రజ లు ఉత్సాహంగా తరలి వచ్చి ఈ కోలా ట భజనను తిలకించి తన్మయం చెందా రు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు హాజరయ్యారు.

పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించండి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. నాగమల్లేశ్వరి

తోట్లవల్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. నాగమల్లేశ్వరి తెలిపారు. పెనమకూరు అంగన్వాడీ కేంద్రం-1 లో బుధవారం అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది ర్యాలీగా ఇంటింటికీ తిరిగి ముగ్గురు పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు పి. లక్ష్మీ, జి. జ్యోతి, సహాయకురాలు కె. చిన్నారి పాల్గొన్నారు.

పమిడిముక్కల : విద్యతోపాటు వినోద , విజ్ఞాన కార్యక్రమాలు, ఇంగ్లీషుపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలీమున్నీసా అన్నారు. అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగం గా బుధవారం నారాయణపురంలో చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది పి.వీరలక్ష్మి, పి.గంగాభవాని పాల్గొన్నారు.

ముళ్లపూడిలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆటపాటలు, విజ్ఞాన వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషా పాల్గొని తల్లుల నుద్దేశించి మాట్లాడారు. అంగన్వాడీల్లో విద్యాబోధన, ఆటపాటలు ఇతర అంశాలను వివరించి దగ్గరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించి ప్రభుత్వ అమల్జేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్త జి.ప్రేమలత పాల్గొన్నారు.



పెనమకూరులో..



నారాయణపురంలో ..

పల్లా శ్రీనివాస్‌ని పరామర్శించిన శివరామ్

తోట్లవల్లూరు : రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను బుధవారం విశాఖపట్నంలో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం ఇటీవల మరణించటంతో విశాఖపట్నం వెళ్లి శ్రీనివాస్‌ను పరామర్శించారు. అలాగే శ్రీనివాస్‌తో కలిసి సింహాచలం చిత్రపటానికి నివాళులర్పించారు.

వితంతు పెన్షన్ల మంజూరు

గుడివాడ : నియోజకవర్గంలో 287 నూతన వితంతు పెన్షన్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొత్త పెన్షన్లను మంజూరు చేశామన్నారు.